అప్పన్న సన్నిధిలో ఇస్రో చైర్మన్

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ గురువారం వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. ఆయన గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. - మెయిన్ 3లో



స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మహా నిరాశ

దిగజారిన జీవీఎంసీ ర్యాంకు

- పది లక్షల జనాభా పైబడిన నగరాల కేటగిరీలో తొమ్మిదో ర్యాంకు
- గత రెండేళ్లు నాలుగో ర్యాంకు
- డోర్ టు డోర్ చెత్తసేకరణలో వెనుకబాటు
- ప్రజా మరుగుదొడ్ల నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో తగ్గిన మార్కులు
- గార్బేజ్ ఫ్రీ సిటీ (జీఎఫ్‌సీ)లో ఫైవ్ స్టార్ సర్టిఫికెట్‌కు పరిమితం

విశాఖపట్నం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): **కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్-2024 పోటీలో జీవీఎంసీ చతికిలపడింది. పది లక్షలకు పైబడిన జనాభా కలిగిన నగరాల కేటగిరీలో గడచిన రెండేళ్లు నాలుగో ర్యాంకును దక్కించుకున్న జీవీఎంసీ గురువారం వెల్లడైన ఫలితాల్లో తొమ్మిదో ర్యాంకుకు దిగజారిపోయింది. ఆరు నెలలపాటు జీవీఎంసీకి పూర్తిస్థాయి కమిషనర్ లేకపోవడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని అధికారులు చెబుతున్నా, క్షేత్రస్థాయిలో పారిశుధ్య నిర్వహణ, డంపింగ్ యార్డుల్లో చెత్త రీసైక్లింగ్, ప్రజా మరుగుదొడ్ల నిర్వహణ విషయాల్లో ఆశించిన ఫలితాలను సాధించలేకపోవడమే కారణమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.**

దేశంలోని నగరాలు, పట్టణాల్లో పరిశుభ్రతను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం 2016 నుంచి స్వచ్ఛ సర్వేక్షణ్ పేరుతో పోటీ

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో 2016 నుంచి జీవీఎంసీ సాధించిన ర్యాంకులు

సంవత్సరం	పోటీలో పాల్గొన్న నగరాలు	జీవీఎంసీ ర్యాంక్
2016	73	5
2017	434	3
2018	4,203	7
2019	4,237	23
2020	4,242	9
2021	4,320	9
2022	4,354	4
2023	4,416	4
2024	4,589	9

నిర్వహిస్తోంది. పోటీలో పాల్గొనే నగరాలు, పట్టణాల్లో పారిశుధ్యం మెరుగుపరచడం, పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన పెంచడం, చెత్తను రోడ్లపై పడేయకుండా ఇంటి వద్దకు వచ్చే వాహనాలకు అందజేయడం, తడి-పొడి చెత్తను ఇంటి వద్దనే వేరుచేసి వాహనాలకు అందజేయడం, యార్డులకు చేరిన చెత్తను తిరిగి వినియోగించుకునేందుకు వీలుగా వివిధ రకాల వనరులను అందుబాటులోకి తెచ్చి సంపదగా మార్చడం వంటి వాటికి కేంద్ర ప్రభుత్వమే నిధులను మంజూరుచేసి స్థానిక సంస్థల ద్వారా పనులు చేయిస్తుంది. ఏడాది చివరిలో కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక బృందాలు వచ్చి నగరాల్లో పరిశుభ్రత, స్థానిక సంస్థల పనితీరు, ప్రజల భాగస్వామ్యం, పరిశుభ్రత గురించి ప్రజల్లో ఉన్న అవగాహన, ఇంటివద్దనే చెత్త విభజన, డోర్ టు డోర్ చెత్తసేకరణ, యార్డుల్లో ... మిగతా 6వ పేజీలో



కేంద్ర గృహ, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి మనోహర్‌లాల్ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్ గార్గ్

'సఫాయిమిత్ర సురక్షిత్' కేటగిరీలో జీవీఎంసీ టాప్

- స్వచ్ఛ సర్వేక్షణ్-2024 ర్యాంకులు విడుదల
- ఢిల్లీలో కేంద్ర గృహ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకున్న మేయర్, కమిషనర్

విశాఖపట్నం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్-2024లో గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) సఫాయిమిత్ర సురక్షిత్ షెహర్ కేటగిరీలో జాతీయస్థాయిలో మొదటి ర్యాంకు దక్కించుకుంది. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో గురువారం జరిగిన జరిగిన కార్యక్రమంలో కేంద్ర గృహ, పట్టణాభివృద్ధి శాఖామంత్రి మనోహర్‌లాల్ చేతులమీదుగా జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావు,ఏపీ పురపాలకశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్, కమిషనర్ కేతన్ గార్గ్ అవార్డును అందుకున్నారు. జీవీఎంసీలో డ్రైనేజీల్లో పూడికతీత, యూజీడీ బ్లాక్ అయినప్పుడు పనులను మనుషులతో (సఫాయి కార్మికులు) కాకుండా యంత్రాలతో చేయిస్తున్నారు. జెట్టింగ్ యంత్రాలు, రోబోలు వంటి వాటితో ప్రస్తుతం పూడిక తీస్తున్నారు. దీంతో కేంద్ర ప్రభుత్వం ... మిగతా 6వ పేజీలో



వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ విశ్వనాథన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు. చిత్రంలో నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి ఉన్నారు.

చెరువుల మీదుగా రహదారులా!?

పార్కింగ్ ఏర్పాట్లు శూన్యం

- వుడా లేఅవుట్ల మీదుగా రహదారులతో సంస్థకే చెడ్డపేరు
- మాస్టర్ ప్లాన్-2041పై వెల్లువెత్తిన అభ్యంతరాలు
- సిరిపురం-ఆశీల్‌మెట్ట రోడ్డును విస్తరణ ఆచరణ సాధ్యం కాదన్న ఎమ్మెల్యే వెలగపూడి
- నగరంలో ఏ రోడ్డునూ 30 మీటర్లకు మించి విస్తరించవద్దని వీఎంఆర్‌డీఏ చైర్మన్, కమిషనర్‌లకు సూచన
- అనకాపల్లి వయా విశాఖపట్నం ఆనందపురం రహదారి విస్తరణను 60 మీటర్లకు పరిమితం చేయాలని పలువురి విజ్ఞప్తి

విశాఖపట్నం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): **రాబోయే ఇరవై ఏళ్లను దృష్టిలో ఉంచుకొని వైసీపీ ప్రభుత్వం రూపొందించిన మాస్టర్ ప్లాన్-2041 తప్పుల తడకలా తయారైందని, వాటిని సవరించాలనే డిమాండ్లు వెల్లువెత్తాయి.**

నగరంలో పార్కింగ్ సమస్య తీవ్రంగా ఉందని వీఎంఆర్‌డీఏ సిరిపురం జంక్షన్‌లో మల్టీ లెవెల్ కారు పార్కింగ్ భవనం నిర్మించిందని, మాస్టర్ ప్లాన్‌లో మాత్రం ఎక్కడా పార్కింగ్ ఏరియాను మార్కింగ్ చేయలేదని పలువురు ప్రస్తావించారు. మాస్టర్ ప్లాన్ అంటూ ప్రైవేటు స్థలాలను తీసుకొని 100 నుంచి 200 అడుగుల వరకు రహదారులను విస్తరిస్తున్నారని, కానీ క్షేత్ర స్థాయి అధికారులు బాధ్యతారాహిత్యం వల్ల ఆ రోడ్లను వ్యాపారులు ఆక్రమించి దుకాణాలు పెట్టుకుంటున్నారని, వాహనాల రాకపోకలకు పాత రహదారే మిగులుతున్నదని ఇంకొందరు ఆరోపించారు. వీఎంఆర్‌డీఏలో చైర్మన్ ప్రణవ్ గోపాల్, ... మిగతా 8వ పేజీలో

ఇంటి నిర్మాణం చేపట్టకుంటే పట్టా రద్దు

- ముందు నోటీస్, ఆ తరువాత చర్యలు
- కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్
- పేదల గృహ నిర్మాణం వేగవంతం చేయాల్సిందిగా అధికారులకు ఆదేశం
- నాణ్యత లోపిస్తే క్రిమినల్ చర్యలు

విశాఖపట్నం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): **జిల్లాలో పేదల కోసం చేపట్టిన ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని హౌసింగ్ అధికారులను కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఇళ్ల నిర్మాణం, మౌలిక సదుపాయాలపై గృహనిర్మాణ సంస్థ, గ్రామీణ నీటి సరఫరా, జీవీఎంసీ, ఈపీడీసీఎల్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే వారంలో గ్రామ సచివాలయాల్లో సభలు నిర్వహించి ఇప్పటివరకూ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టకపోతే ఇళ్లతోపాటు పట్టాలు రద్దు చేస్తామనే విషయం చెప్పాలన్నారు. వారం రోజుల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టకపోతే నోటీసులు జారీచేసి, ఆ తరువాత కేటాయింపును రద్దు చేయాలని ఆదేశించారు.**

అదేవిధంగా ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసిన కాలనీల్లో మౌలిక వసతులు, విద్యుత్, తాగునీరు వంటి సదుపాయాలు కల్పించాలన్నారు. త్వరలో నిర్మాణాలు పూర్తికానున్న లేఅవుట్‌లలో కూడా వసతుల కల్పనపై దృష్టిసారించాలన్నారు. అన్ని లేఅవుట్‌లలో ఏడాదికాలంలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ల నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడవద్దని స్పష్టంచేశారు. నాణ్యతా లోపం ఉంటే గృహ నిర్మాణ సంస్థ అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని, అవసరమైతే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. సమీక్షలో గృహ నిర్మాణ సంస్థ పీడీ సత్తిబాబు, గ్రామీణ నీటి సరఫరా విభాగం, ఈపీడీసీఎల్, జీవీఎంసీ ఎస్ఈలు కేవీవీ చౌదరి, శ్యాంబాబు, రవి, హౌసింగ్ ఈఈలు, డీఈలు పాల్గొన్నారు.



ఇళ్ల నిర్మాణాలపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్. పాల్గొన్న అధికారులు

సంక్రాంతి నాటికి టిడ్కో గృహాలు

చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్

పెదగంట్యాడ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పేద వర్గాల కోసం రాష్ట్రవ్యాప్తంగా నిర్మించిన టిడ్కో గృహాలను వచ్చే సంక్రాంతి నాటికి లబ్ధిదారులకు అందజేస్తామని ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ తెలిపారు. టిడ్కో చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన గురువారం తొలిసారిగా నగరానికి విచ్చేశారు. జీవీఎంసీ 65వ వార్డు భానోజీతోటలో నిర్మించిన టిడ్కో గృహ సముదాయాన్ని పరిశీలించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో అజయ్‌కుమార్ మాట్లాడుతూ పేదల అవసరాలు తీర్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. టిడ్కో గృహ నిర్మాణంలో సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు తాను ... మిగతా 6వ పేజీలో

కొండలు కొల్లగొడుతున్నారు

అనుమతులు లేకుండా యథేచ్ఛగా తవ్వకాలు

- గుర్రంపాలెం, పెదముషిడివాడ, ఊడేరుల్లో యంత్రాలు స్వాధీనం చేసుకున్న గనుల శాఖ అధికారులు
- విజిలెన్స్ అధికారులకు నేతల ఫోన్
- అక్రమ క్వారీయింగ్‌పై ఉన్నతాధికారులకు నివేదిక



అనకాపల్లి మండలం వేటజంగాలపాలెంలో రాత్రిపూట గ్రావెల్ అక్రమ తవ్వకాలు

విశాఖపట్నం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): **ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో అనుమతులు లేకుండా మట్టి, గ్రావెల్, రాయి తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతు న్నాయి. సుమారు వందచోట్ల అక్రమంగా క్వారీయింగ్ జరుగుతుంది. ఈ విషయమై గనుల శాఖ విజిలెన్స్ విభాగం ఉన్నతాధికారులకు నివేదించినట్టు తెలిసింది.**

గనుల శాఖ రెగ్యులర్, విజిలెన్స్ విభాగాల అధికారులు వేర్వేరుగా పగటిపూట దాడులు చేస్తున్నారు. అక్రమ క్వారీయింగ్ చేస్తున్న యంత్రాలను సీజ్ చేస్తున్నారు. అయితే మాఫియా మాత్రం పగటిపూట కంటే రాత్రి సమయాల్లోనే ఎక్కువగా క్వారీయింగ్ చేస్తోంది. గనుల శాఖలో పరిమితంగా ఉన్న సిబ్బంది రాత్రిపూట దాడులు చేయడం లేదు. ఒకవేళ ఒకరు, ఇద్దరు తనిఖీలకు వెళితే మాఫియా ఎదురు దాడులకు పాల్పడే అవకాశం ఉంది. దీనికితోడు అనేకచోట్ల అక్రమంగా చేపడుతున్న క్వారీయింగ్‌ను అరికట్టేంత యంత్రాంగం గనుల శాఖకు లేదు. దీంతో అధికార పార్టీ నాయకుల పేరు చెబుతూ క్వారీ మాఫియా కొండలను కొల్లగొడుతోంది.

కొత్తగా క్వారీయింగ్‌కు కేంద్ర ... మిగతా 8వ పేజీలో

ప్రభుత్వ స్థలం దర్జాగా కబ్జా

- కొండపోరంబోకులో పక్కా నిర్మాణం
- నాలుగు నెలల క్రితం తొలగించిన అధికారులు
- పునర్నిర్మించిన అక్రమార్కులు

గోపాలపట్నం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కబ్జాదారులు బరితెగించారు. కొండపోరంబోకు స్థలాన్ని ఆక్రమించి చేపట్టిన నిర్మాణాన్ని రెవెన్యూ అధికారులు గతంలో తొలగిస్తే...రాజకీయ నేతల దన్నుతో మళ్లీ అక్కడే పునర్నిర్మించారు.

గ్రేటర్ పరిధి 92వ వార్డు పద్మనాభనగర్ సర్వే నంబర్ 76లోని కొండపోరంబోకు స్థలంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో ఒకరు అక్రమ నిర్మాణం చేపట్టారు. అక్రమ నిర్మాణం జరుగుతున్న విషయం తెలుసుకున్న జీవీఎంసీ, రెవెన్యూ అధికారులు పాక్షికంగా తొలగించారు. నిర్మాణ పనులు నిలిపివేయాలని సదరు నిర్మాణదారుడిని హెచ్చరించి వెళ్లిపోయారు. అయితే కాస్త రాజకీయ పలుకుపడి ఉన్న అతను దర్జాగా మళ్లీ నిర్మాణాన్ని పూర్తిచేశాడు. దీనిపై మళ్లీ ఫిర్యాదు వెళ్లడంతో రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు ఈ ప్రాంతంలో ... మిగతా 6వ పేజీలో



కొండపోరంబోకు స్థలంలో నిర్మించిన రేకుల షెడ్డును పరిశీలిస్తున్న రెవిన్యూ, జీవీఎంసీ అధికారులు

దారితప్పిన దర్యాప్తు

- ఫోర్త్‌టౌన్ పోలీసుల వింతవైఖరి
- కిడ్నీ రాకెట్ తీగ లాగకుండా హోటల్‌కు బిల్లు కట్టలేదనే ఫిర్యాదు మేరకు వైద్యుడిపై కేసు నమోదు

విశాఖపట్నం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కిడ్నీ మార్పిడి కోసం ఇద్దరు వ్యక్తులను నగరానికి రప్పించి, వారి కోసం హోటల్‌లో రూమ్ బుక్ చేసిన వైద్యుడితోపాటు వారి వెనుక ఉన్నవారెవరనేది బయటకు లాగాల్సిన ఫోర్త్ టౌన్ పోలీసులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏలూరు జిల్లాకు చెందిన రంగబాబు, ఏసురాజు అనేవారు గత నెల 30న నగరానికి వచ్చి అక్కయ్యపాలెంలోని ఒక హోటల్‌లో దిగారు. వారిద్దరూ కిడ్నీ విక్రయం గురించి చర్చించుకుంటుండగా హోటల్ సిబ్బంది విని, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వారిద్దరినీ స్టేషన్‌కు తీసుకువెళ్లి విచారించగా, డాక్టర్ ఆనంద్ అనే వ్యక్తి తనకు ఫేస్‌బుక్‌లో పరిచయమయ్యారని, కిడ్నీ విక్రయం గురించి మాట్లాడుకున్నామని రంగబాబు చెప్పాడు. కిడ్నీ విక్రయం నేరం కాబట్టి, పోలీసులు రంగబాబు వాంగ్మూలంపై నిజనిజాలు నిర్ధారించుకుని వైద్యుడిపై కేసు నమోదుచేయాలి. వైద్యుడితోపాటు ఏజెంట్లు, మరెవరికైనా ఈ వ్యవహారంలో సంబంధం ఉందా? అనేదానిపై దర్యాప్తుచేయాలి. కానీ పోలీసులు మాత్రం దీనికి విరుద్ధంగా వ్యవహరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కిడ్నీ విక్రయంపై ఇద్దరు వ్యక్తులు చర్చించుకుంటున్నట్టు తెలియగానే వారిని స్టేషన్‌కు తీసుకువచ్చిన పోలీసులు ఆ విషయాన్ని...ఈనెల 13 వరకు ఉన్నతాధికారులకు గానీ, మీడియాకు గానీ వెల్లడించలేదు. దీనిపై స్పెషల్‌బ్రాంచికి చెందిన హెడ్‌కానిస్టేబుల్ ఒకరు సమాచారం సేకరించి ఉన్నతాధికారులకు చేరవేయడంతో విషయం బయటపడింది. ఈ వ్యవహారంపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమవ్వడంతో సీపీ శంఖబ్రతబాగ్చీ స్పందించారు. అసలు హోటల్‌లో ఏం జరిగిందనే దానిపై తక్షణం తనకు నివేదించాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఏసీపీ కె.లక్ష్మణమూర్తి హోటల్‌కు ... మిగతా 6వ పేజీలో

మెట్రో కారిడార్-1, 3లో 312 గృహాలకు నష్టం

- ప్రజాభిప్రాయ సేకరణలో అధికారుల వెల్లడి



మెట్రో రైలు ప్రాజెక్ట్ గురించి వివరిస్తున్న సామాజిక నిపుణుడు మాధవరెడ్డి

విశాఖపట్నం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో చేపట్టే మెట్రో రైలు ప్రాజెక్టు వల్ల కారిడార్-1, 3లలో సుమారు 312 గృహాలు, వ్యాపార భవనాలు పోతాయని అధికారులు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ ఏర్పాటు చేసిన సామాజిక ప్రభావం అంచనా (ఎస్ఐఏ) అధికారుల బృందం గురువారం అబిద్ నగర్ కల్యాణ మండం, ఆశీల్‌మెట్ట వేమన మందిరంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాలు నిర్వహించింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, కారిడార్-1లో 94 నివాస గృహాలు (74 ఇళ్ల ప్రహరీ గోడలు మాత్రమే పోతాయని, 20 ఇళ్లు పూర్తిగా) ... మిగతా 6వ పేజీలో

అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన



సింహాచలం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా గురువారం పసిడి కుసుమార్చన వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామి వారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఆలయ పద్మనిధి నుంచి పసిడి కుసుమాలు తీసి భక్తులతో స్వామి పటిని వేదమంత్రాల ప్రదక్షిణ చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని, శ్రీదేవిభూదేవిలను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ ప్రతి నామానికి పసిడి కుసుమాలతో అర్చన చేశారు. తరువాత అదే వేదికపై నిత్య కల్యాణం నిర్వహించారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి సిరిపురం ప్రాంతానికి చెందిన శ్రీనివాస పాణిగ్రాహి రూ. లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తాన్ని నగదు రూపంలో దేవస్థానం ప్రజా సంబంధాల విభాగం పర్యవేక్షణాధికారి వెంకటేశ్వరరావు, పీఆర్‌ఓ అన్నవరాయుడులకు గురువారం ఆయన అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాతకు అధికారులు అంతరాలయంలో స్వామివారి దర్శనం కల్పించి, శేషవస్త్రంతో సత్కరించి, ప్రసాదాలు అందజేశారు.

విద్యా ప్రదాత ఆనంద గజపతిరాజు



సింహాచలం,జూలై 17 (ఆంధ్రజ్యోతి): సింహాచలం దేవస్థానం పూర్వపు ధర్మకర్త దివంగత పూసపాటి ఆనంద గజపతిరాజు ఎందరికో ఉచితంగా విద్యను అందించారని దేవస్థానం ఈఓ వేండ్ర త్రినాథరావు అన్నారు. ఆనందగజపతిరాజు 75వ జయంతి పురస్కరించుకుని గురువారం ఈఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

'పరిసరాల పరిశుభ్రత ముఖ్యం'

పద్మనాభం రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతపై ప్రతిఒక్కరికీ అవగాహన అవసరమని డీపీఓ, ఎంపీపీ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన రేవిడి పంచాయతీలో పారిశుధ్యం నిర్వహణ, తాగునీటి వనరుల క్లోరినేషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో వ్యాధులు ప్రబలకుండా ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ముఖ్యంగా కాలువలు, పూల కుండీల్లో నీటి నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు.

మెట్ల మార్గం తెరిపించాలని వినతి

సింహాచలం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వచ్చే భక్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న తమకు రెండు నెలలుగా వ్యాపారాలు లేక ఇబ్బందులు పడుతున్నామని సింహగిరి వర్తకులు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు తెలిపారు. గురువారం వారు నగరంలో ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈఏడాది జరిగిన చందనోత్సవంలో సింహగిరిపై గోడ కూలిన దుర్ఘటనలో ఏడుగురు మృతి చెందారని, దీంతో దేవస్థానం అధికారులు మెట్ల మార్గాన్ని మూసివేశారని చెప్పారు. అప్పటి నుంచి తమ వ్యాపారాలు పూర్తిగా తగ్గిపోయాయని, మెట్ల మార్గాన్ని తెరిపించి తమకు ఉపాధి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వర్తకసంఘం ప్రతినిధులు సానపోయిన పైడిరాజు, పండారి మురళి, తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ పాలకవర్గం ప్రమాణ స్వీకారం

పద్మనాభం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పీఏసీఎస్) పని చేయాలని మాజీ ఎంపీపీ ఆర్‌ఎస్‌డీపీ అప్పలనరసింహరాజు చెప్పారు. పాండ్రంగి పీఏసీఎస్‌కు ప్రభుత్వం నియమించిన నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం గురువారం జరిగింది. ఛైర్మన్‌గా శ్రీనివాసరావు, సభ్యులుగా దొంతల అప్పలనాయుడు, పాండ్రంగి అప్పలనాయుడు బాధ్యతలు స్వీకరించారు. వారితో పీఏసీఎస్ సీఈఓ టి. సన్యాసిరావు ప్రమాణ స్వీకారం చేయించారు.

ఫేక్ అకౌంట్లు అందించిన నలుగురి అరెస్టు

ఎండాడ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లకు మనీ మ్యూల్ అకౌంట్స్‌ను సరఫరా చేస్తున్న నలుగుర్ని సైబర్ క్రైం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. నగరానికి చెందిన 76 ఏళ్ల వ్యక్తికి ఒక తెలియని నెంబర్ నుంచి ఫోన్ కాల్ రావడంతో లిఫ్ట్ చేస్తే బ్లూడార్ట్ కొరియర్ సర్వీస్ ప్రతినిధినని చెప్పి ముంబై నుంచి థైవాన్‌కి మీ పేరు మీద పార్సిల్ బుక్ అయ్యిందని అందులో నిషేధిత, చట్ట విరుద్ధ వస్తువులున్నట్లు కస్టమ్స్ అధికారులు గుర్తించారని చెప్పాడు. ఆ పార్సిల్ తనది కాదని సదరు వ్యక్తి చెప్పగా, వెంటనే అతని వ్యక్తిగత వివరాలు చెప్పడంతో భయాందోళనకు గురయ్యాడు. ఎవిడెన్స్ నమోదైందని, ముంబై రావాలని బెదిరించి, కోటి అరవై రూ. లక్షలు దోచుకున్నారు. ఈ నగదు తెలంగాణలోని కరీంనగర్, జగిత్యాలలోని గాయత్రి అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకుకు ట్రాన్స్‌ఫర్ అయినట్లు సైబర్ పోలీసులు గుర్తించారు. సైబర్ నేరగాళ్లకు అకౌంట్స్ అందించిన గోలి శశికుమార్, గాజుల నవీన్, రాజు రాజేందర్, ఉప్పునూరి నరేష్‌ను అరెస్టు చేసి, వారి నుంచి సెల్ ఫోన్లు, బ్యాంక్ అకౌంట్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన ముద్దాయిల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

నకిలీ పత్రాలతో స్థలం విక్రయం

ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు

కొమ్మాది, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నకిలీ పత్రాలతో స్థలాన్ని విక్రయించిన ఇద్దరిని అరెస్టు చేసినట్టు నార్త్ జోన్ ఏసీపీ అప్పలరాజు తెలిపారు. గురువారం రాత్రి ఆయన పీఎంపాలెం పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. మల్కాపురానికి చెందిన దంపతులు వాదుకుల మణికుమారి, ప్రసాదరావు ఉద్యోగరీత్యా విదేశాల్లో ఉంటున్నారు. నగరంలో స్థలం కొనుగోలు చేయాలన్న ఉద్దేశంతో వారు పేస్‌బుక్‌లో వెతుకుతుండగా పిల్లి అశోక్ పరిచయమయ్యారు. ఆయన రియల్ ఎస్టేట్ ఏజెంట్‌గా ప్రసాదరావు పరిచయం చేసుకుని, ఎజ్జల శ్రీనివాస్ అలియాస్ దుబాయ్ శ్రీను ఎమ్మెల్యే గ్రూప్ ఆఫీసులోనే పరిచయం చేశారు. తాము విదేశాల్లో ఉన్న వారికి స్థలాలు కొనడం, అమ్మడం చేస్తుంటామని వారిని నమ్మించి మధురవాడలోని టీచర్స్ లేఅవుట్‌లో ఉన్న స్థలాన్ని చూపించారు. ఆ స్థలం కొండేటి మీనాక్షి, రూప్‌కుమార్ పేరుతో ఉందని, వారి తల్లిదండ్రులకు వారే అసలైన వారసులని చెప్పారు. ఆన్‌లైన్‌లో చెకీతే మాకు నమ్మకం ఏమిటని ప్రసాదరావు ప్రశ్నించగా ముందు స్థలం రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తామని, ఆ తరువాత డబ్బులు ఇవ్వాలని చెప్పి టీచర్స్ లేఅవుట్‌లోని 155 చదరపు గజాల స్థలాన్ని మణికుమారి పేరుతో రిజిస్ట్రేషన్ చేయించి డాక్యుమెంట్లను పంపించారు. ఈమేరకు ప్రసాదరావు దఫదఫాలుగా దుబాయ్ శ్రీను అకౌంట్‌కి 53,78,875 రూపాయలు పంపించారు. ఇది తతంగం మొత్తం గత ఏడాది జూలై, ఆగస్టు నెలల్లో జరిగింది. ప్రసాదరావు దంపతులు ఇటీవల విశాఖ వచ్చి తమ స్థలం చూసుకోవడానికి మధురవాడ రాగా స్థలం అప్పన్నవానికి స్థలానికి ఎలాంటి సంబంధం లేదని గ్రహించారు. పీఎంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయగా సీపీ ఆదేశాల మేరకు సీఐ బాలకృష్ణ, ఎస్ఐ భాస్కరరావు కేసు దర్యాప్తు చేసి, దుబాయ్ శ్రీను, పిల్లి అశోక్‌ను అదుపులోకి తీసుకున్నారు. కాగా కొండేటి రూప్‌కుమార్, నిమ్మగడ్డ నాగేశ్వరరావు, కొల్లిపర వెంకట దినకర్ స్థలాలకు నకిలీ పత్రాలు సృష్టించి, మొత్తం 900 గజాలను 150 గజాల చొప్పున విభజించి ఒక భాగాన్ని ప్రసాదరావుకు విక్రయించారని తెలిపారు. మిగిలిన వారిని వెదికారికి అన్వేషిస్తున్నారు. పోలీసులు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

» ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
» కొసనవానిపాలెంలో 'తొలి అడుగు'

భీమునిపట్నం రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఆయన చిప్పాడ పంచాయతీలోని కొసనవానిపాలెం గ్రామంలో జరిగిన సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అందరికీ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. శ్మశానవాటిక, కాలువలు, రోడ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, నాయకులు జి. తాతినాయుడు, వెంకటనారాయణ, సరగడ అప్పారావు, గంటా నూకరాజు, గాడు అప్పలనాయుడు, గొలగాని నరేంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.

చిప్పాడ హైస్కూల్ భవనం ప్రారంభం

చిప్పాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దివీస్ యాజమాన్యం సీఎస్ఆర్ నిధులు రూ. 1.18 కోట్లతో నిర్మించిన నూతన భవనాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివీస్ యాజమాన్యం పాఠశాలకు నూతన భవనం నిర్మించడమే కాకుండా వంద బెంచీలు, ఉపాధ్యాయులకు కుర్చీలు, బీరువాలు అందించడం అభినందనీయమన్నారు. తెలుగు విద్యార్థులకు కోలాటం వేస్తూ ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. దివీస్ జనరల్ మేనేజరు ఎంఎస్ఎన్ రావు మాట్లాడుతూ తమ సంస్థ సీఎస్ఆర్ నిధులతో అందించిన్న ప్రజా సేవా కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గాడు వెంకటప్పడు, సరగడ అప్పారావు, ఎంపీటీసీ సభ్యురాలు దుక్క ఈశ్వరమ్మ, సర్పంచ్ రమావతి, పాఠశాల ఎస్ఎంసీ ఛైర్మన్ శంకర్‌రెడ్డి, డీఈఓ ప్రేమ్ కుమార్, సీఎస్ఆర్ మేనేజరు సురేష్‌కుమార్, దివీస్ యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.



పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం

» కలెక్టర్ హరేంధిర ప్రసాద్
» నవోదయ విద్యాలయంలో తల్లిదండ్రుల సమావేశం



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

కొమ్మాది, జూలై 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ కూడా అవసరమని కలెక్టర్ హరేంధిరప్రసాద్ అన్నారు. గురువారం ఆయన కొమ్మాదిలోని నవోదయ విద్యాలయంలో జరిగిన మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశానికి అధ్యక్షత వహించారు. తెలుగు విద్యాలయం పనితీరు, ఫలితాలు, గత ఏడాది నిర్వహించిన కార్యక్రమాల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యాలయంలో చేపట్టిన కార్యక్రమాలను కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ తరగతి గదులను సందర్శించి, విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలించారు. మైగ్రేషన్ విధానంలో మధ్యప్రదేశ్ నుంచి వచ్చి ఇక్కడ చదువుతున్న విద్యార్థులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యాలయం అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో డీఈఓ ప్రేమ్‌కుమార్, డీఎం హెచ్ఓ జగదీశ్వరరావు,విశాఖ వేలీ స్కూల్ ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్, విద్యా కమిటీ ప్రతినిధి ఎన్. శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యపై అవగాహన



మాట్లాడుతున్న విద్యుత్ శాఖాధికారి ధర్మరాజు

ఆనందపురం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిడిజాలలో సాయి గణపతి పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ కళాశాలలో కన్జ్యూమర్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ ఫోరం (సీజీఆర్ఎఫ్)పై స్థానిక విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో గురువారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ ఈపీడీసీఎల్ ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. ధర్మరాజు మాట్లాడుతూ ఎలక్ట్రికల్ నెట్‌వర్క్‌లో ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఎలా స్పందించాలో విద్యార్థులకు వివరించారు. జోన్-3 ఈఈ సింహాచలం నాయుడు మాట్లాడుతూ సూర్యఘర్ ప్రాజెక్టును ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. సీజీఆర్ఎఫ్ ఛైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ ఏదైనా సమస్యపై టోల్ ఫ్రీ నంబరు 1912 కు ఫోన్ చేయాలని, పరిష్కారం కాకపోతే సీజీఆర్ఎఫ్‌లో పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎల్. ఉమామహేశ్వరరావు, ఏఈ ఎం. అప్పలనాయుడు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ భాస్కర్

కళాశాల టైమింగ్స్ మార్చాలని ఆందోళన

కొమ్మాది, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పీఎంపాలెం సాంకేతిక ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు గురువారం కళాశాల ప్రధాన కార్యాలయం వద్ద ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో కళాశాలను ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 3 వరకు నిర్వహించేవారని, ప్రస్తుతం ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 వరకు మార్చడం వల్ల దూర ప్రాంతాల నుంచి వస్తున్న వారు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కొందరు ఇళ్లకు చేరేసరికి రాత్రి పది అవుతుందన్నారు. కాగా పీఎంపాలెం పోలీసులు కళాశాలకు చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. కళాశాల ప్రతినిధులతో మాట్లాడతామని ఆందోళన చెందవద్దని ఎస్ఐ భాస్కర్ నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

సంక్రాంతి నాటికి టిడ్కో గృహాలు

... 5వ పేజీ తరువాయి

ఇక్కడకు రావడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఆదేశాలతో పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు, స్థానిక నాయకులు గంధం వెంకటరావు, కసిరెడ్డి సత్యనారాయణ, గడసాల అప్పారావు, తిప్పల రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం దర్జాగా కబ్జా

... 5వ పేజీ తరువాయి

గురువారం సర్వే చేపట్టారు. ఆర్ఐ కోమలి, వీఆర్వో సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జీవీఎంసీ సర్వేయర్ కుమారస్వామి, రెవెన్యూ సర్వేయర్ రాజగోపాల్ సర్వే నిర్వహించి ఈ నిర్మాణం పూర్తిగా కొండపోరంబోకు స్థలంలో ఉందని నిర్ధారించారు. అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తామని చెప్పి వెళ్లిపోయారు. రాజకీయ ఒత్తిళ్లు వస్తున్నాయని ఊహాగానాల నేపథ్యంలో ఈ నిర్మాణాన్ని తొలగిస్తారా లేదా అనే విషయమై పలువురు సందేహాలు వ్యక్తపరుస్తున్నారు.

మద్దిలపేటలో 'పొలంబడి'

భీమునిపట్నం రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వరి సాగులో నూతనంగా వస్తున్న శాస్త్రీయ పద్ధతులు, ఎరువులు, పురుగు మందుల వినియోగంపై రైతులకు అవగాహన అవసరమని ఏఓ శివకమలి తెలిపారు. గురువారం మద్దిలపేటలో జరిగిన పొలంబడి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వరి సాగులో యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యల గురించి అవగాహన కల్పించారు.

దారి తప్పిన దర్యాప్తు

... 5వ పేజీ తరువాయి

వెళ్లి విచారణ జరిపారు. గత నెల 30న ఏలూరు జిల్లాకు చెందిన ఇద్దరు వ్యక్తులకు గది బుక్ చేసిన వైద్యుడు డాక్టర్ ఆనంద్, ఈ ఏడాది జనవరిలో ఒడిశాకు చెందిన ముగ్గురికి అదే హోటల్‌లో రూమ్ బుక్ చేసినట్టు తేలింది. పైగా ఆ ముగ్గురు మూడు రోజులు హోటల్‌లోనే ఉండి తర్వాత బిల్లు చెల్లించకుండా వెళ్లిపోవడంతో రూమ్ బుక్ చేసిన డాక్టర్ ఆనంద్‌ను సిబ్బంది సంప్రదించగా, స్పందించలేదని తేలింది. ఈ నేపథ్యంలో రూమ్ తీసుకున్న వైద్యుడు బిల్లు చెల్లించలేదని సిబ్బంది వద్ద పోర్ట్ టౌన్ పోలీసులు ఫిర్యాదు తీసుకుని బుధవారం కేసు నమోదుచేశారు. అంతేవ్యక్తి డాక్టర్ ఆనంద్ గతంలో ముగ్గురు వ్యక్తులను ఒడిశా నుంచి ఎందుకు రప్పించారు, ఇప్పుడు మరో ఇద్దరిని ఎందుకు రప్పించారు?...అనే విషయాలను విస్మరించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

312 గృహాలకు నష్టం

... 5వ పేజీ తరువాయి

నష్టపోవాలని ఉంటుందని వివరించారు. కారిడార్-3లో మొత్తం 26 ఇళ్లు పోతాయన్నారు. వీటికి సంబంధించిన సలహాలు, సూచనలు ప్రజల నుంచి అడిగి తెలుసుకున్నారు. వాటన్నిటినీ ఒక పుస్తకంలో నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఏపీ సామజిక, పర్యావరణ నిపుణులు మాదవరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుధాసాగర్, డిప్యూటీ తహశీల్దార్ పద్మావతి, సర్వేయర్లు, ఆర్ఐలు, మెట్రో రైలు ప్రాజెక్టు ఇంజినీర్ ఎస్.వసంత్, పరదేశి బాబు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మహా నిరాశ

... 5వ పేజీ తరువాయి

చెత్త నిర్వహణ వంటి అంశాలను నేరుగా పరిశీలిస్తాయి. ఉత్తమ పనితీరు సాధించిన నగరాలకు అవార్డులు అందజేస్తుంది. 2016లో దేశవ్యాప్తంగా 73 నగరాలు స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీలో పాల్గొంటే జీవీఎంసీ ఐదో ర్యాంకు దక్కించుకుంది. 2017లో 434 నగరాలు పాల్గొంటే మూడో ర్యాంకు దక్కించుకుంది. 2018లో 4,203 నగరాలు పోటీ పడితే పది లక్షల పైబడి జనాభా కలిగిన నగరాల కేటగిరీలో జీవీఎంసీ ఏడో ర్యాంక్ దక్కించుకుంది. 2019లో 4,237 నగరాలు పోటీపడితే 23, 2020లో 4,242 నగరాలు పోటీపడగా 9, 2021లో 4,320 నగరాలు పోటీపడితే 9, 2022లో 4,354 నగరాలు పోటీపడితే 4, 2023లో 4,416 నగరాలు పోటీపడితే నాలుగో ర్యాంకు దక్కింది. అయితే 2024లో 4,589 నగరాలు పోటీపడగా జీవీఎంసీ తొమ్మిదో ర్యాంకుకు దిగజారిపోయింది.

జీవీఎంసీకి ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకూ పూర్తిస్థాయి కమిషనర్ లేకపోవడం వల్లనే స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జీవీఎంసీ వెనుకబడిందని కొందరు అధికారులు అభిప్రాయపడుతున్నారు. మరికొందరు అధికారులు మాత్రం స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే బృందాలు ఈ ఏడాది ఫిబ్రవరిలోనే నగరంలో పర్యటించాయని, దానికి, పూర్తిస్థాయి కమిషనర్ లేకపోవడానికి సంబంధం లేదని పేర్కొంటున్నారు. అధికారుల్లో ఉదాసీనత పెరిగిపోవడం, క్షేత్రస్థాయిలో కొందరు సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహించడంతో పారిశుధ్య నిర్వహణ ప్రమాణాలు క్షీణించిందని, అదే ర్యాంకు దిగజారడానికి కారణమని పేర్కొంటున్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో దిగజారడానికి అనేక కారణాలు

స్వచ్ఛ సర్వేక్షణ్-2024లో మొత్తం 12,500 మార్కులకు పోటీ నిర్వహించారు. వీటిలో డోర్ టూ డోర్ చెత్త సేకరణ, విభజన, చెత్తను సంపదగా మార్చడం, పునర్వినియోగానికి వీలుగా చెత్తను మార్చే వసతులు అందుబాటులోకి తేవడం, క్షేత్రస్థాయిలో మార్కెట్లు, రోడ్లు, జనావాసాలు, ప్రజా మరుగుదొడ్లు, గెడ్డలను శుభ్రంగా ఉంచడానికి సంబంధించి పదివేల మార్కులు కేటాయించారు. జనవాసాలలో చెత్త నిల్వలు లేకుండా చేయడం, బహిరంగ మలవిసర్జన నిర్మూలించడం, మురుగునీటిని శుద్ధి చేసి పునర్వినియోగానికి వాడడం వంటి విభాగాల్లో సాధించిన సర్టిఫికెట్లకు 2,500 మార్కులు కేటాయించారు. అయితే జీవీఎంసీకి చెందిన కాపులుప్పాడలోని డంపింగ్ యార్డులో చెత్తకుప్పలను బయో మైనింగ్ ద్వారా పునర్వినియోగానికి వీలుగా తయారుచేయడం, అక్కడ భూమిని ఖాళీ చేసి పచ్చదనం పెంపు దిశగా పనులు జరుగుతున్నాయి. 2025 జనవరి నాటికి యార్డులో చెత్తరేకులను చేయాల్సి ఉండగా, ఇంకా 20 శాతానికి పైగా అలాగే ఉండిపోవడంతో గార్బేజ్ ఫ్రీసిటీ (జీఎఫ్‌సీ)లో ఫైవ్ స్టార్ ర్యాంక్ సర్టిఫికెట్ మాత్రమే కేంద్రం జారీచేసింది. సూపర్ స్వచ్ఛ లీగ్‌లో స్థానం దక్కించుకున్న విజయవాడ, గుంటూరు, తిరుపతి నగరాలతో పాటు స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జీవీఎంసీ కంటే మెరుగైన ర్యాంకులు సాధించిన నగరాలన్నీ జీఎఫ్‌సీలో సెవెన్ స్టార్ ర్యాంకులను దక్కించుకున్నాయి. దీనివల్ల జీవీఎంసీ 2,500 మార్కులకు గాను కేవలం 2,300 మార్కులు మాత్రమే దక్కించుకుంది.

అలాగే డోర్ టూ డోర్ చెత్తసేకరణ నగరంలో 96 శాతం మాత్రమే జరుగుతుండడం, తడి పొడి చెత్తవిభజన 81 శాతం మాత్రమే జరగడం, జోన్ స్థాయిలో ఉన్న డంపింగ్ యార్డుల్లో చెత్తను ఏరోజుకారోజు యార్డుకు తరలించే ప్రక్రియ 98 శాతం మాత్రమే జరగడం, ప్రజా మరుగుదొడ్ల పరిశుభ్రతలో 97 శాతానికే పరిమితం కావడం వంటి కారణాల వల్ల పది వేల మార్కులకు 9,336 మార్కులు మాత్రమే వచ్చాయి. దీంతో మొత్తం 12,500 మార్కులకు 11,636 మార్కులను దాటలేకపోయింది. దీనివల్ల పది లక్షల జనాభా కలిగిన నగరాల కేటగిరీలో జీవీఎంసీ తొమ్మిదో ర్యాంకుకు దిగజారిపోవాల్సి వచ్చింది.



వికసించిన బ్రహ్మ కమలాలు

ఎండాడ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఎండాడ లా కళాశాల రోడ్డులో పనోరమ హిల్స్ ఆవరణలో ఉన్న సెలబ్రిటీ టవర్స్‌లో పల్లా లక్ష్మీ నివాసం వద్ద బ్రహ్మ కమలాలు వికసించాయి. ఒక మొక్కకు ఏకంగా పది పువ్వులు పూశాయి. ఏడాదిలో ఒకసారి మాత్రమే వికసించే ఈ పూలను స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

బీసీ సంక్షేమ సంఘం

రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మరుపిళ్ల

ఆనందపురం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పెద్దిపాలెం గ్రామానికి చెందిన మరుపిళ్ల సాయి జ్ఞానేశ్వర్ నియమితులయ్యారు. గురువారం ఆయన హైదరాబాద్‌లో ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్య చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. సాయి జ్ఞానేశ్వర్ ప్రస్తుతం మండల తెలుగు యువత ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పని చేస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరం

పద్మనాభం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంట గ్రామంలో విజయనగరం పట్టణానికి చెందిన సాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ బొదల పావని ఈ శిబిరాన్ని ప్రారంభించారు.

హత్య కేసులో నలుగురి అరెస్టు

మహారాణిపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో డాబాగార్డెన్స్ వద్ద ఆదివారం అర్ధరాత్రి జరిగిన హత్య కేసుకు సంబంధించి నలుగురిని అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. జగదాంబ జంక్షన్ వద్ద నివాసం ఉంటున్న శెట్టి ఎల్లాజీ (21) స్విగ్గీలో డెలివరీ బాయ్‌గా పని చేసేవాడు. ఆదివారం అర్ధరాత్రి 1 గంట సమయంలో ఎల్లాజీ, ఆయన్న అనే తన స్నేహితుడు, మరో ముగ్గురితో కలిసి మద్యం సేవించారు. అనంతరం వారి మధ్య చిన్నపాటి వివాదం జరిగింది. ఈ గొడవలో మిగతా ముగ్గురు ఎల్లాజీపై కత్తితో దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. ఈ మేరకు నిందితులు సాలిపేటకు చెందిన గోలగాని చరణ్ అలియాస్ అయ్యప్ప, గొర్లుగుబల్లి దుర్గా ప్రసాద్ అలియాస్ యాసిడ్ దుర్గా, కోన పృథ్వీ అలియాస్ పండు, ఆరిలోవకు చెందిన మజికంల సాయిని పోలీసులు గురువారం అరెస్టు చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భీమునిపట్నం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): భీమిలి సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-3 ఈఈ సింహాచలంనాయుడు తెలిపారు. భీమిలి 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ వేములవలస ఇండస్ట్రియల్, 11 కేవీ భీమిలి రూరల్ ఫీడర్, 33/11 కేవీ చేపలుప్పాడ సబ్‌స్టేషన్‌లో పరిధిలో 11 కేవీ చేపలుప్పాడ ఫీడర్‌లో మరమ్మతులు జరుగుతున్నాయి. ఈమేరకు జేవీ అగ్రహారం, కొత్తవలస, నిడిగట్టు, చిలుకూరి లేఅవుట్, విలాసం లేఅవుట్, పెద్ద ఉప్పాడ, చిన ఉప్పాడ, గంగడిపాలెం, గోడిపేట, కొత్తూరు, చేపల ఉప్పాడపాలెం, బోయిలూరు, పెద బస ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

15 మద్యం బాటిళ్లు స్వాధీనం

పద్మనాభం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న రెండు బెల్టు దుకాణాలపై గురువారం రాత్రి దాడి చేసి 15 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు పద్మనాభం సీఐ శ్రీధర్ చెప్పారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సామయ్యవలసలో బెల్టు షాపులో మద్యం విక్రయిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి కె. గణేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నాలుగు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే కృష్ణాపురంలో ఎస్ఐ జె. సురేష్ సిబ్బందితో వెళ్లి బెల్టుషాపు నిర్వహిస్తున్న ఏ. అదినారాయణ వద్ద 11 సీసాలు స్వాధీనం చేసుకుని అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

టెన్త్, ఇంటర్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

భీమునిపట్నం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో అధిక మార్కులు సాధించిన భీమిలి, ఆనందపురం, పద్మనాభం కేజీబీవీ బాలికలకు మాన్సాస్ సంస్థ నగదు బహుమతులు అందించింది. భీమిలి మాజీ ఎమ్మెల్యే దివంగత పూసపాటి ఆనందగజపతిరాజు జయంతి పురస్కరించుకుని 50 మంది విద్యార్థినులకు రూ. 5 వేల చొప్పున కేంద్ర మాజీ మంత్రి, గోవా గవర్నర్ అశోక్‌గజపతిరాజు చేతుల మీదుగా అందించారు.విశాఖ సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జె. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో విజయనగరంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్టు భీమిలి కేజీ బీవీ ప్రిన్సిపాల్ తెలిపారు.

ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేయొద్దు : జడ్సీ

మధురవాడ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రోడ్లు, ఖాళీ స్థలాల్లో చెత్త వేయడం వల్ల పరిసరాలు పాడవుతున్నాయని జోన్-2 జడ్సీ కనక మహాలక్ష్మి తెలిపారు. ఏడో వార్డు పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో రోడ్ల పక్కన స్థానికులు చెత్త వేయడంతో జీవీఎంసీ సిబ్బంది గురువారం ఆయా ప్రాంతాలను శుభ్రం చేసి ముగ్గులు వేశారు. అలాగే వాటి చుట్టూ పూలకుండీలు ఏర్పాటు చేసి మొక్కలు నాటారు. రంగవల్లుల వెనుక వైపు గేదకు ఫ్లెక్సీ అతికించారు. చెత్త వేస్తే రూ.1000 జరిమానా చెల్లించవలసి ఉంటుందని హెచ్చరించారు.



చెత్త తొలగించి మొక్కలు పెట్టిన దృశ్యం

విధి నిర్వహణలో అప్రమత్తం

కొమ్మాది, జూలై 17 (ఆంధ్రజ్యోతి): పోలీసులు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని కమాండెంట్ వడ్డాపాతరావు అన్నారు. గురువారం ఐక్యసపాలెం 16వ పోలీస్ బెటాలియన్‌లో దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బెటాలియన్ సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత దర్బారులో సిబ్బంది తెలిపిన సమస్యలు పరిష్కరించామన్నారు.

'సఫాయిమిత్ర సురక్షిత్'

కేటగిరీలో జీవీఎంసీ టాప్

... 5వ పేజీ తరువాయి

జీవీఎంసీకి సఫాయిమిత్ర సురక్షిత్ షెహర్ కేటగిరీలో మొదటి ర్యాంకు లభించింది. ఈ సందర్భంగా మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ నగర ప్రజల సహకారం, జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు, అధికారులతోపాటు కార్పొరేటర్ల కృషి కారణంగానే జీవీఎంసీకి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందన్నారు. ఇదే స్ఫూర్తితో రోడ్ల పక్క ఉత్తమ సర్వేక్షణ్ పోటీలో మరింత ఉత్తమ ప్రతిభ కనబరిచేందుకు కృషిచేస్తామని ఆశాభావం వ్యక్తంచేశారు. కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ వచ్చే ఏడాది స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీ కోసం ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించుకుని అధికారులు, ప్రజలను భాగస్వామ్యులను చేస్తూ ముందుకువెళతామన్నారు. ఇదిలావుండగా స్వచ్ఛ సర్వేక్షణ్-2025 పోటీలో అవార్డు అందుకున్న వారిలో జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈఎన్వీ నరేష్‌కుమార్, చీఫ్ ఇంజనీర్ పల్లంరాజు ఉన్నారు.

ఘనంగా ముత్యమాంబ అమ్మవారి ఉత్సవాలు



పూజలు అందుకుంటున్న అమ్మవారు

ఆరిలోవ, జూలై 17 (ఆంధ్రజ్యోతి) :చిన గదిలికి సమీపంలోని సంతపాలెం గ్రామ దేవత ముత్యమాంబ అమ్మ వారి ఉత్సవాలు గురువారం వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి పూజలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి కానుకలు, మొక్కులను సమర్పించుకున్నారు. సాయంత్రం అమ్మవారి అనుపు ఉత్సవాలు సందడిగా నిర్వహించారు.

బాలికలకు చెస్ బోర్డులు పంపిణీ

విశాఖపట్నం, జూలై 17(ఆంధ్రజ్యోతి) : ప్రపంచ చెస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నగరంలోని ప్రభుత్వ బాలికల వసతిగృహాన్ని ఆంధ్రా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేశ్ అడుసుమిల్లి, ఇండియన్ కోస్టుగార్డ్ డిప్యూటీ కమాండెంట్ అకిల్ పఠాని సందర్శించారు. ఈ సందర్భంగా వసతిగృహంలోని బాలికలకు చెస్ బోర్డులు, విద్య, సాహిత్యం పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం సురేశ్ అడుసుమిల్లి మాట్లాడుతూ అనాథలు, అవకాశాలు లేని పిల్లలకు చెస్ గేమ్‌ను పరిచయం చేసి వారికి దీర్ఘకాలంగా ఆంధ్రా చెస్ అసోసియేషన్ అండగా ఉంటుందన్నారు. వసతి గృహంలోని బాలికలకు నిరంతరం చెస్ బోర్డులు, చెస్ నేర్చుకునేందుకు అవసరమైన వనరులను సమకూరుస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సహకారాన్ని అందించిన కెన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పి.సంతోశ్ మాట్లాడుతూ చెస్ మన ఆలోచనా ధోరణిని మారుస్తుందని, మనసును ప్రశాంతంగా ఉంచుతుందన్నారు. కార్యక్రమంలో వసతిగృహం సూపరింటెండెంట్ చిలుక నయోమి, తదితరులు పాల్గొన్నారు.

ఏయూ ఫైనార్ట్స్ విభాగం హెచ్‌వోడీగా సింహాచలం



సింహాచలానికి ఉత్తర్వులు అందజేస్తున్న రిజిస్ట్రార్ ధనుంజయరావు

వెంకోజీపాలెం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ఏయూ ఫైనార్ట్స్ విభాగం అధిపతిగా (హెచ్‌వోడీ) ఆచార్య డి.సింహాచలం నియమితులయ్యారు. ఈ సందర్భంగా సంబంధిత ఉత్తర్వులను ఆయనకు రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

సినిమా గైడ్

- **తమ్ముడు** : మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక)
- **జురాసిక్ వరల్డ్** : జగదాంబ, రమాదేవి
- **కన్నప్ప** : జగదాంబ, కిన్నెర, శ్రీకన్య, లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ),
- **కుబేర** : సంగం, ఊర్వశి (కంచరపాలెం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఎఫ్.1** : రమాదేవి, జగదాంబ,
- **మార్గన్** : శారద, శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 28, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 24, పచ్చిమిర్చి 84, కాకరకాయలు 36, బీరకాయలు 28, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 22, క్యారెట్ 40, దొండకాయలు 32, బంగాళదుంపలు 17, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 58,అల్లం (పాతది) 48, బరబాటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 42, బద్దచిక్కుడు 50, దోస కాయలు 18, వె ల్లుల్లి (పెద్దవి) 85, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 90, కీరదోస 34, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడ దుంపలు 40, కంద 54,దేముడు చిక్కుడు 70, గోరు చిక్కుడు 40, కూర పెండలం 30, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, క్రరపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	73
లైవ్ ధర	93
విత్ స్కిన్	156
స్కిన్‌లెస్	166

యువత ముందుకొస్తే రక్తదానం కొరత తీరుతుంది

» వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్



రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్న వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్, నెరేడ్కో ప్రతినిధులు

సిరిపురం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని రక్తం కొరత తీరాలంటే యువత పెద్ద ఎత్తున రక్తదానం చేయాలని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ పిలుపునిచ్చారు.గురువారం సిరిపురంలోని వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లోని నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (నెరేడ్కో), వీఎంఆర్డీఏ సంయుక్త ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం, వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై నెరేడ్కో రాష్ట్ర అధ్యక్షుడు గద్దె చక్రధర్, అడ్వైజర్ కమిటీ చైర్మన్ చోడే పట్టాభిరామ్‌తో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రణవ్‌గోపాల్ మాట్లాడుతూ ఒకరు రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న ముగ్గురికి ప్రాణదానం చేసినట్టవుతుందన్నారు. దేశ వ్యాప్తంగా వైద్యం కోసం రక్తం అవసరం రోజురోజుకూ పెరుగుతోందని, దీన్ని మనమంతా గమనించి రక్తదానం చేయాలని కోరారు. నేరెడ్కో రాష్ట్ర అధ్యక్షుడు గద్దె చక్రధర్ మాట్లాడుతూ సమాజంపై తమకు గల బాధ్యతను గుర్తించి ఈ తరహా కార్యక్రమాలను చేపట్టామన్నారు. నేరెడ్కో, వీఎంఆర్డీఏ సంయుక్తంగా ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్, రోటరీ, రెడ్ క్రాస్, అపోలో సహకారంతో మెగా రక్తదాన శిబిరంతో పాటు బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, ఈసీజీ, బీఎంఐ పరీక్షలను ఉచితంగా అందించడం జరిగిందన్నారు. మొత్తం 607 యూనిట్ల రక్తం సేకరించినట్టు తెలిపారు. నెరెడ్కో అడ్వైజర్ కమిటీ చైర్మన్ చోడే పట్టాభిరామ్ మాట్లాడుతూ రక్తదానం చేయడం పవిత్రమైన కార్యక్రమమన్నారు. కార్యక్రమంలో నేరెడ్కో నార్త్ జోన్ ప్రెసిడెంట్ ఏ.రమేష్‌బాబు, సెక్రటరీ జనరల్ దండమూడి పాపారావు, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్స్ ఎం.ఎ.హస్సేన్, వై.వి.చౌదరి, చీఫ్ ప్యాట్రన్ తాళ్లూరి పూర్ణచంద్రరావు, కేవీవీ సుబ్బారావు, జోన్ 1 మీడియా కో ఆర్డినేటర్ బైరెడ్డి పోతన్నరెడ్డి, ఎగ్జిక్యూటివ్ సభ్యులు పాల్గొన్నారు.తదుపరి రక్తదానం చేసిన యువత సర్టిఫికేట్స్ మెమెంటోలను ను అతిథుల చేతులమీదుగా పంపిణీ చేశారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

» బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ » కృష్ణా కళాశాలలో స్వచ్ఛభారత్



పరిసరాలు శుభ్రం చేస్తున్న పీవీఎన్ మాధవ్, ఎన్‌ఎస్‌ఎస్ జోనల్ అధికారి పోల ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్ విజయబాబు తదితరులు

మద్దిలపాలెం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : పరిశుభ్రతే లక్ష్యంగా స్వచ్ఛభారత్ కార్యక్రమాల్ని ప్రతీ ఒక్కరూ చేపట్టాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జాతీయ సేవాపథకం, వాకర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2014, అక్టోబర్ 2 గాంధీ జయంతి రోజున స్వచ్ఛభారత్‌కు ప్రధానిమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారన్నారు. దేశాన్ని శుభ్రం చేసుకోవాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో పౌరులు పెద్ద ఎత్తున పాల్గొని తమ ప్రాంతాలు పరిశుభ్రంగా చేస్తున్నారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు మాట్లాడుతూ మన ఇంటిని ఎంత శుభ్రంగా ఉంచుతామో, పరిసరాలను కూడా అంతే పరిశుభ్రంగా చూసుకోవాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తాచెదారాలు వేయకూడదన్నారు. అనంతరం కళాశాల మైదానంలో చెత్త చెదారాలు ఏరివేసి శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ జోనల్ అధికారి పోల ఉమామహేశ్వరరావు, ప్రతాప్, బాలకృష్ణ, శ్రీనివాసప్రసాద్ పాల్గొన్నారు.

సమతా డిగ్రీ కళాశాలలో..



ఎంవీపీ కాలనీ : సమతా కళాశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు, గ్రీన్ క్లైమెట్ ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : సమస్త జీవరాశులను పరిరక్షించే పర్యావరణాన్ని కాపాడటానికి ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని గ్రీన్ క్లైమెట్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం కోరారు. ఎంవీపీ కాలనీలోని సమత డిగ్రీ కళాశాలలో గురువారం ఎడారీకరణ నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. సమతా కళాశాల డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్, ప్రోగ్రాం అధికారి రామకృష్ణ, డాక్టర్ రాజేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్, ఎంపీ శ్రీభరత్ చొరవతో స్వదేశానికి చేరిన యువత



విదేశాల్లో చిక్కుకున్న యువకులతో ఎంపీ శ్రీభరత్

భీమునిపట్నం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : కంబోడియాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు వెళ్లి మోసపోయిన ఉత్తరాంధ్రకు చెందిన ఇద్దరు యువకులు మంత్రి నారా లోకేశ్, ఎంపీ శ్రీభరత్ చొరవతో స్వదేశానికి క్షేమంగా చేరారు. భీమునిపట్నంలోని 4వ వార్డు జేవీ అగ్రహారం గ్రామానికి చెందిన మీసాల ఆదిబాబు (32), శ్రీకాకుళం జిల్లా గార మండలం బోరవానిపేట గ్రామానికి చెందిన బోగి వినయ్‌గత ఏడాది సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల కోసం కంబోడియా వెళ్లారు. అక్కడ సైబర్ నేరగాళ్ల చేతితో మోసపోయి ఉద్యోగాలు లేక నానాఅవస్థలు పడ్డారు. తిండి లేక నరకయాతన అనుభవించారు. ఈ విషయాన్ని బాధిత కుటుంబీకులు భీమిలికి చెందిన టీడీపీ నాయుడు వానపల్లి సత్యకు చెప్పడంతో ఆయన గత నెల 22న ఎంపీ శ్రీభరత్ దృష్టికి తీసుకువెళ్లారు. ఎంపీ ఈ విషయాన్ని మంత్రి లోకేశ్‌కు తెలిపారు. సత్వరమే స్పందించిన లోకేశ్ అధికారుల ద్వారా వివరాలు తీసుకుని కేంద్రంలోని సంబంధిత శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎట్టకేలకు మంగళవారం రాత్రి ఆ ఇద్దరు యువకులు నగరానికి చేరుకున్నారు. వారిని పార్టీ నాయకుడు సత్య ఎంపీ శ్రీభరత్ దగ్గరకు తీసుకువెళ్లారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలంటే కంబోడియాకు వెళ్లామని, అక్కడ మోసపోయి పడిన కష్టాలను ఎంపీతో చెప్పి కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ విదేశాల్లో మంచి ఉద్యోగం వస్తుందన్న ఆశతో చాలామంది యువత ఆకర్షణీయ ప్రకటనలకు లోనవుతున్నారన్నారు. తక్కువ అర్హతతో పెద్ద జీతం అని ప్రకటనలు ఆశ చూపి మోసగాళ్లు ట్రాప్ చేస్తూ, బాధలకు గురి చేస్తున్నారన్నారు. అటువంటి వ్యక్తులు, ప్రకటనల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

ఒప్పంద డిగ్రీ అధ్యాపకుల రెన్యువల్స్‌కు అవకాశం

మద్దిలపాలెం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : జోన్-1, జోన్2 పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పని చేస్తున్న ఒప్పంద అధ్యాపకులు 2025-26 విద్యాసంవత్సరానికి రెన్యువల్ చేసుకోవడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు తెలిపారు. ఒప్పంద అధ్యాపకుల ఈ నెల 19లోగా తమ దరఖాస్తులను తాము పని చేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్స్‌కు సమర్పించాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అధ్యాపకులకు ఈ నెల 21, 22, 23 తేదీల్లో జిల్లా సెలక్షన్ కమిటీ కౌన్సెలింగ్ నిర్వహిస్తుందని పేర్కొన్నారు. కౌన్సెలింగ్ తర్వాత ఒప్పంద అధ్యాపకులు 2025-26 ఏడాదికి అగ్రిమెంట్ చేసుకోవాలని తెలిపారు.

సాంకేతిక సమస్యతో నిలిచిన సర్టిఫికెట్ల పరిశీలన

భీమునిపట్నం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (డీఈఈ సెట్)లో అర్హత పొందిన అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన గురువారం సాంకేతిక సమస్య వల్ల నిలిచిపోయింది. భీమిలి డైట్ కళాశాలలో గురువారం నుంచి ఈ ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉంది. మధ్యాహ్నం వరకూ ఆన్‌లైన్‌లో సమస్యలు తలెత్తడంతో సాయంత్రం కేవలం ఇద్దరు అభ్యర్థులకు మాత్రమే సర్టిఫికెట్లు పరిశీలించామని అధికారులు తెలిపారు. శుక్రవారం నుంచి షెడ్యూల్ ప్రకారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకూ సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందన్నారు.

సంపత్ వినాయగర్ ఆలయ హుండీ లెక్కింపు

» రూ.14,98,503 ఆదాయం

సిరిపురం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : సంపత్ వినాయగర్ దేవాలయం హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. గడచిన 21 రోజులకు గాను రూ.14,98,503 ఆదాయం లభించినట్టు ఆలయ సహాయ కమిషనర్ డీవీవీ ప్రసాదరావు, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టీఆర్ చోళన్ తెలిపారు. బంగారం 000-001-047 మిల్లీ గ్రాములు, వెండి 000-207 గ్రాములు, యూఎస్‌ఏ డాలర్స్ 8, కెనడా డాలర్స్ 5, కతర్ రియల్ 1 వచ్చినట్టు తెలిపారు. హుండీ లెక్కింపులో శ్రీ వెంకటేశ్వర సేవా సంఘం సభ్యులు, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ టి.అన్నపూర్ణ , తనిఖీదారులుగా ఎం.శ్రీధర్, దేవాలయ సిబ్బంది జి.గోవిందరెడ్డి, ఎస్.ప్రసాద్, భక్తులు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

బోధన అభినయ ప్రాధాన్యంగా ఉండడం అవసరం

» అంతర్జాతీ రంగస్థల ప్రముఖుడు శ్రీగ్లెన్ హేడెన్



శ్రీగ్లెన్ హేడెన్‌ను సత్కరిస్తున్న ఏయూ ఆచార్యులు

వెంకోజీపాలెం, జూలై 17(ఆంధ్రజ్యోతి) : బోధన ఎప్పుడూ అభినయ ప్రాధాన్యంగా ఉండాలని ఆస్ట్రేలియాకు చెందిన ప్రఖ్యాత అంతర్జాతీయ ప్రదర్శన కళల రంగస్థల ప్రముఖుడు శ్రీగ్లెన్ హేడెన్ పేర్కొన్నారు. ఉపాధ్యాయులు విద్యావేత్తలుగా మాత్రమే కాకుండా, ప్రేక్షకులను ఆకర్షించే విధంగా స్ఫూర్తిదాయకంగా, సమర్థవంతంగా సంభాషించాల్సిన ప్రదర్శకులుగా కూడా వారి డైనమిక్ పాత్రను పోషించాలన్నారు. గురువారం ఏయూలోని విద్యా విభాగంలో 'టీచర్ యాజ్ ఎ పెర్ఫార్మర్' అనే అంశంపై ప్రత్యేక ఆయన ఉపన్యసించారు. ఈ సందర్భంగా శ్రీగ్లెన్ హేడెన్ మాట్లాడుతూ.. థియేటర్ ఆర్ట్స్ విద్యలో తన విస్తృత అనుభవం నుంచి తరగతి గది బోధనలో ఉనికి, వాయిస్ మాడ్యులేషన్, బాడీ లాంగ్వేజ్, కథ చెప్పడం ప్రాముఖ్యతను వివరించారు.

విద్యాశాఖాధిపతి డాక్టర్ టి.షారోన్‌రాజు ఈ సెషన్‌కు అధ్యక్షత వహించారు. డీన్ వాన్ ల్యావెన్ పీస్ స్టడీస్ సెంటర్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ చల్లా కృష్ణవీర్ అభిషేక్ విద్యలో సృజనాత్మక నిశ్చితార్థం ప్రాధాన్యం, విద్యా సంస్థలలో శాంతి. భావోద్వేగ శ్రే యస్సుకు ప్రదర్శనాత్మక బోధనా పద్ధతులు ఎలా దోహదపడతాయో మాట్లాడారు. విద్యా విరమణ చేసిన ప్రొఫెసర్ ఎంఎస్‌ఆర్కే శర్మ వర్సిటీ విద్యా సమాజాన్ని ప్రేరేపించడానికి, విద్యావంతులను చేయడానికి విద్య, కళలలో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన స్వరాలను ఆహ్వానించడానికి విభాగం తీసుకున్న చొరవను అభినందిస్తూ సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో ఒక ఇంటరాక్టివ్ సెషన్‌తో ముగిసింది. ఈ సందర్భంగా శ్రీగ్లెన్ హెడెన్‌ను ఏయూ ఆచార్యులు సత్కరించారు.

డిజిటల్ యుగంలో నాణ్యమైన విద్యను అందించాలి

» ఐఐక్యూఏ సీఈవో డాక్టర్ టి.రవీందర్‌రెడ్డి



డాక్టర్ రవీందర్‌రెడ్డిని సత్కరిస్తున్న ఏయూ వీసీ, ఇతర ఆచార్యులు

వెంకోజీపాలెం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : డిజిటల్ యుగంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ క్వాలిటీ అక్రిడిటేషన్ (ఐఐక్యూఏ) సీఈవో డాక్టర్ టి.రవీందర్‌రెడ్డి అన్నారు. ఏయూ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న శతాబ్ది వాణి కార్యక్రమంలో భాగంగా గురువారం రవీంద్ర రెడ్డి ప్రసంగించారు. నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో జాతీయ విద్యా విధానం-2020 అమల్లోకి వచ్చిందన్నారు. సాంకేతికత నేడు బోధన, అభ్యసన రంగాల్లోకి ప్రవేశించిందని చెప్పారు. కమ్యూనికేషన్, ప్రజెంటేషన్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఏఐతో పోటీ పడాల్సిన అవసరం ఏర్పడుతోందన్నారు. ప్రతి విద్యార్థి జ్ఞానం, నైపుణ్యాలు, వ్యక్తిత్వం ఈ మూడు అంశాలు అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. అభ్యసనం వ్యక్తి అవగాహనను మార్పు చేస్తుందని వివరించారు. జ్ఞానం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విధానాన్ని వివరించారు. వీటిని అనుగుణంగా సిలబస్‌లో మార్పులు చేయాల్సిన ఆవశ్యకతను సైతం తెలియజేశారు. క్యూఎస్ ర్యాంకింగ్, నాక్ ర్యాంకింగ్ వంటివి సాధించడం ద్వారా మెరుగైన ప్రమాణాలను నిలుపుకోవడం సాధ్యపడుతుందన్నారు. కళాశాలలు ర్యాంకింగ్‌కు ధరఖాస్తు చేసుకుని సాధించే దిశగా కృషి చేయాలని తెలిపారు. ఏయూ ఉపకులపతి జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ గ్లోబల్ కాంపిటేషన్‌కు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. ఈ తరుణంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థలు కార్పొరేట్ వ్యవస్థలతో పోటీ పడాల్సిన అవసరం ఉందని తెలిపారు. డీన్ ఔట్రీచ్ ఆచార్య కె.రమాసుధ కార్యక్రమం లక్ష్యాన్ని వివరించారు. ఏయూ అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధికారులు, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ ఆనంద గజపతిరాజు, కంటిన్యూయింగ్ ఎడ్యుకేషన్ అసోసియేట్ డీన్ డాక్టర్ పి.వెంకటరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఆరిలోవ , జూలై 17 (ఆంధ్రజ్యోతి) : విమ్స్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో గల 11 కేవీ రెవెన్యూ కాలనీ ఫీడర్ నిర్వహణ కార్యక్రమంలో భాగంగా పలు చోట్ల కొమ్మలు నరికే కార్యక్రమం చేపడుతున్నట్టు జోన్-3 ఈపీడీసీఎల్ ఆపరేషన్స్ విభాగం ఈఈ బి.సింహచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు ఆయన తెలిపారు.

ఈ సందర్భంగా విశాలాక్షినగర్, చలపతి నగర్, రెవెన్యూకాలనీ, కైలాసగిరి రోడ్డు, షిర్డీ సాయి వెటర్నరీ కాలనీ, సంజీవనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాని ఆయన కోరారు.

అశోక్‌కు మాధవ్ అభినందనలు



అశోక్‌గజపతిరాజుతో పీవీఎన్ మాధవ్, తదితరులు

విశాఖపట్నం/ పెదవాల్తేర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గోవా గవర్నర్‌గా నియమితులైన పూసపాటి అశోక్‌గజపతిరాజును బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. విజయనగరంలోని అశోక్ బంగ్లాలో ఆయనను కలిసి అభినందనలు తెలిపిన వారిలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాలం, విశాఖ జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎన్ పరశురామరాజు, విజయనగరం జిల్లా అధ్యక్షుడు రాజేశ్ వర్మ ఉన్నారు.

శివాజీనగర్‌లో అన్నసమారాధన



అన్నదానంలో పాల్గొన్న 13వ వార్డు కార్పొరేటర్ సునీత

ఆరిలోవ, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులో గల శివాజీనగర్‌లో వెలసిన గ్రామ దేవత ముత్యాలంబ అమ్మవారి జాతర మహోత్సవం మారువారం సందర్భంగా గురువారం అన్నసమారాధన నిర్వహించారు, స్థానిక కార్పొరేటర్ కెల్ల సునీత ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుమారు 3 వేల మంది అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు పిల్లి వీర్రాజు, రెడ్డి సత్తిరాజు కమిటీ సభ్యులు అప్పారావు, మధు, అమృతరావు, సత్యనారాయణ, గణేశ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూ కాంట్రాక్టు టీచర్స్ సమస్యలు పరిష్కరించాలి

» బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌కు వినతి

పెదవాల్తేరు, జూలై 17 : (ఆంధ్రజ్యోతి) ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ యూనివర్శిటీ కాంట్రాక్ట్ టీచర్స్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం నగర బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ను కాంట్రాక్ట్ టీచర్స్ కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కోడి అర్జునుడు, డాక్టర్ పల్లవి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో పని చేస్తున్న ఒప్పంద అధ్యాపకుల ఇబ్బందులను మాధవ్‌కు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 15 నుంచి 20 ఏళ్లుగా ఒప్పంద ఆచార్యులుగా అతి తక్కువ జీతానికి పని చేస్తూ ఉంటే గౌరవ హైకోర్టు తమకు ఉద్యోగ భద్రత డీఏ, హెచ్‌ఆర్‌ఏతో కూడిన టైం స్కేల్ ఇవ్వమని తీర్పు చెబితే, ఇప్పటివరకూ అమలు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జనవరిలో జీవో నెంబర్ 2ను టైం స్కేల్ అమలు చేయమని విడుదల చేస్తే అమలు చేయకపోగా, కొత్తగా అగ్రిమెంట్ ఆఫ్ కాంట్రాక్ట్ సర్వీస్ అనే పేరుతో కొత్త నిబంధనలను పెట్టి ఉద్యోగాలకు భద్రత లేకుండా ఎప్పుడు ఉద్యోగం తీసివేసినా ప్రశ్నించకుండా కోర్టులకు వెళ్లకుండా, ఎవరినీ కలవకుండా ఉండాలనే నిబంధనలతో కూడిన పత్రంపై సంతకాలు చేయమని ఆంధ్రప్రదేశ్ హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ ఒత్తిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై మాధవ్ స్పందిస్తూ ఒప్పంద ఆచార్యులుగా పని చేస్తున్న మీరందరూ ఎంత కష్టపడుతున్నారో నాకు మొదటినుంచి తెలుసనీ, తప్పకుండా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

ఆటోడ్రైవర్లకు 'వాహన మిత్ర'

» ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి గోవింద్ డిమాండ్



ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో కార్మికులు

వెంకోజీపాలెం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం గత ఎన్నికల మేనిఫెస్టోలో వాగ్దానం చేసిన విధంగా రాష్ట్రంలో ఆటో మోటారు వాహన డ్రైవర్లకు వాహనమిత్ర రూ.15000 అమలు చేయాలని, వాహన మిత్ర పథకం అమలుకు పెట్టిన షరతులను తొలగించాలని ఆంధ్రప్రదేశ్ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద్ డిమాండ్ చేశారు. గురువారం సీతమ్మధార అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నుంచి హెచ్‌బీ కాలనీ మీదుగా వెంకోజీపాలెం ఆంజనేయస్వామి విగ్రహం వరకు ఆటోలతో కార్మికులు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పడాల గోవింద్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఆటో, మోటార్ డ్రైవర్ల సంక్షేమం కోసం వాహనమిత్ర అమలుతోపాటు కార్మిక సంక్షేమానికి కృషి చేస్తామని హామీ ఇచ్చి సంవత్సరం కాలం దాటిపోయిన ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వం ఆటో, మోటార్ రంగ కార్మికుల సంక్షేమ కోసం ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం అన్యాయమన్నారు. ఇప్పటికే పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ నిత్యవసర వస్తువులు ధరలు జిల్లా హద్దులు పిల్లల చదువులు ఫీజులు విపరీతంగా పెరగడంతో చాలిచాలని ఆదాయంతో బ్రతుకుతూ ఆటో డ్రైవర్లు జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరొకక వైపు మూలుగే నక్కపైన తాటి పండ్లు పడ్డట్టు జీవో 21, 31 జారీ చేసిన ప్రభుత్వం పోలీసు ఆర్టీవో డిపార్ట్మెంట్లు ద్వారా హద్దు అదుపు లేకుండా డ్రైవర్లపైన అక్రమ కేసులు రాస్తూ వాహనాలను సీజ్ చేయడం అత్యధికంగా ఫైన్లు విధించడం వలన ఆటో డ్రైవర్లు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి ఆటో, మోటార్ రంగ కార్మికుల సంక్షేమం కోసం ఈఎస్ఐ, పీఎఫ్, వంటి సౌకర్యాలు కల్పిస్తూ కార్మిక సంక్షేమ చట్టాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ, ఆటో ఫెడరేషన్ అధ్యక్షులు అడ్డూరు శంకర్, ఎస్.మధు రెడ్డి, లంకా గోవింద్, పి.కృష్ణంనాయుడు, శ్రీను, దల్లినాని, ఎం.సింహాచలం, చిన్న, కేలం శివ, వై.వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం/ సీతమ్మధార, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9.30 నుంచి మధ్యా హ్నం 2 గంటల వరకు శ్రీనివాసనగర్, నందగిరినగర్, వేంకటేశ్వర కాలనీ, ఎనభై అడుగుల రోడ్డు, తాటిచెట్లపాలెం, తాటిచెట్లపాలెం రైల్వే క్వార్టర్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ పొలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అలాగే కొత్త విద్యుత్ లైన్లు అమర్చడం, చెట్ల కొమ్మలు తొలగింపు పనులు నిమిత్తం శుక్రవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్ లే అవుట్, బాలయ్యశాస్త్రి లే అవుట్, అల్లూరి సీతారామరాజు నగర్, రామకృష్ణ నగర్, సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వెనుక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ జోన్-1 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్ పి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

రేపు సరఫరా ఉండని ప్రాంతాలు..

అలాగే శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శాంతినగర్, అక్కయ్యపాలెం ప్రధాన రహదారి, సాయిబాబా గుడి ఏరియా, ఎన్‌జీజీఓస్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఈపీడీసీఎల్ ఈఈ పొలాకి శ్రీనివాసరావు తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రాల అందజేత



పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, పీవీఎన్ మాధవ్

సీతమ్మధార, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : సీతమ్మధార బాలయ్యశాస్త్రి లే అవుట్‌లో గల బీజేపీ ఉత్తర నియోజకవర్గం కార్యాలయంలో పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు పత్రాలను ఎమ్మెల్యే పి.విష్ణు కుమార్ రాజు గురువారం అందజేశారు. సూర్య మంగదేవికి రూ.75,729, నరసెట్టి కిషోర్‌కు రూ.22 వేలు, నడుపూరి గణేష్‌కు రూ.74,570లకు సంబంధించిన సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రాలను అందజేశారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, బీజేపీ నాయకులు, వార్డు అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్జీజీవోస్ కాలనీలో భవనం తొలగింపునకు చర్యలు

- 2017లో భవన నిర్మాణం పూర్తి
- జీవీఎంసీకి భవనం ప్లాన్ చార్జీలు చెల్లించని యజమాని
- రూ.8.5 లక్షలు చెల్లించాలంటూ గ్రేటర్ అధికారుల నోటీసులు
- స్పందించకపోవడంతో రంగంలోకి దిగిన టౌన్‌ప్లానిగ్
- పాక్షికంగా తొలగింపు చర్యలు
- యజమాని స్పందన బట్టి తదుపరి నిర్ణయం అంటున్న అధికారులు



మెట్ల మార్గాన్ని తొలగించిన దృశ్యం

మురళీనగర్, జులై 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్జీజీవోస్ కాలనీలో నిర్మాణం పూర్తయిన ఓ భవనం ప్లాన్ ఛార్జీలు వసూలు చేయడంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఉదాసీన వైఖరి బయట పడింది. ఈ భవన నిర్మాణం 2017లో పూర్తయి, భవనంలో కమర్షియల్ షాపులు కూడా నడుస్తున్నాయి. ఎన్జీజీవోస్ కాలనీ 48ఎ బస్టాప్ పక్కనే ఉన్న ఈ భవనం ప్లాన్ ఫీజులు మాత్రం జీవీఎంసీకు చెల్లించలేదు. భవన యజమాని ప్లాన్ ఫీజులు కట్టకుంటే జీవీఎంసీ సిబ్బంది ఇన్నేళ్లు అవకాశం ఎలా ఇచ్చారా? అన్నది అర్థం కావడం లేదు. ఎక్కడైనా కొత్తగా భవన నిర్మాణం ఆరంభిస్తే పునాదులు తీసే నాటికే మహా విశాఖ నగర పాలక సంస్థకు టౌన్‌ప్లానింగ్ విభాగం ద్వారా బిల్డింగ్ అప్రూవల్ ఛార్జీలు జమ కావాల్సిందే. అలాంటిది నిర్మాణం పూర్తయి, ఎనిమిదేళ్లు షాపింగ్ కాంప్లెక్సు అద్దెలు కూడా వసూలు చేసుకుంటున్న సదరు భవన యజమానిపై ఇప్పటి వరకూ చర్యలు లేవు. ఇటీవల జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారుల్లో చలనం వచ్చి బిల్డింగ్ అప్రూవల్ షార్ట్ ఫాల్ ప్లాన్ అమౌంట్ మొత్తం బాకీ అక్షరాల రూ.ఎనిమిది లక్షల యాభై వేల రూపాయలు చెల్లించాలని కొద్ది రోజులుగా ఒత్తిడి తేవడం మొదలు పెట్టారు. అంతేకాకుండా జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది భవనం వద్దకు తరచూ వెళ్లి అక్కడ ఉన్న దుకాణదారులకు విషయం వివరించారు. ప్లాన్ చార్జీలు కట్టకుండా భవనాన్ని కూల్చే పరిస్థితి ఎదురవుతుందని స్పష్టం చేశారు.

దీంతో భవనంలో ఉంటున్న షాపుల నిర్వాహకులు తమ వద్ద దుకానాల కోసం తీసుకున్న అడ్వాన్స్‌లు ఇచ్చేయాలని, దుకాణాలను ఖాళీ చేస్తామంటూ కోరారు. వారి మాటలను కూడా భవన యజమాని పట్టించుకోలేదు.ఈ నేపథ్యంలో అక్కడ దుకాణాలు నిర్వహిస్తున్న వారంతా బిల్డింగ్‌పై పెద్ద ఫ్లెక్సీ బోర్డు పెట్టారు. 'బాబూ, మా షాపుల నిమిత్తం తీసుకున్న అడ్వాన్సు నగదు మొత్తం తిరిగి ఇచ్చేస్తే, మేం మరో దుకాణం చూసుకుంటాం' అంటూ ఆ బోర్డులో రాసి ఉంచారు.

యజమాని స్పందన బట్టి తదుపరి చర్యలు..

అయినప్పటికీ భవన యజమాని నుంచి స్పందన లేదు. ఈ నేపథ్యంలో జీవీఎంసీజోన్-5 టౌన్ ప్లానింగ్ ఇన్‌చార్జి బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్, స్క్వాడ్ సిబ్బంది కార్మికులతో గురువారం తొలగింపు పనులు చేపట్టారు. మరో నాలుగు రోజుల వ్యవధిలో యజమాని స్పందనను బట్టి భవనం స్లాబ్‌ల కూల్చివేతకు కూడా చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి బిల్డింగ్ ఇన్‌స్పెక్టరు పవన్‌కుమార్ తెలిపారు. భవనం వద్ద పాక్షిక తొలగింపుతో దుకాణదారులకు రాకపోకల మెట్ల మార్గం బంద్ అయింది.

ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర అమలు చేయాలి

ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద్



ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో డ్రైవర్లు

సీతమ్మధార, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం గత ఎన్నికల్లో మేనిఫెస్టోలో వాగ్దానం చేసిన విధంగా రాష్ట్రంలో ఆటో మోటారు వాహనల డ్రైవర్లకు వాహనమిత్ర రూ.15,000 అమలు చేయాలని, వాహన మిత్ర పథకం అమలుకు పెట్టిన షరతులను తొలగించాలని ఆంధ్రప్రదేశ్ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద్ డిమాండ్ చేశారు. సీతమ్మధార కూడాలిలో గల అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్న గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా పడాల గోవింద్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఆటో, మోటార్ డ్రైవర్ల సంక్షేమం కోసం వాహన మిత్ర అమలుతో పాటు కార్మిక సంక్షేమానికి కృషి చేస్తామని హామి ఇచ్చి సంవత్సర కాలం దాటినా కూటమి తన హామీ నిలబెట్టుకోకపోవడం శోచనీయమన్నారు. రోజు రోజుకూ పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ నిత్యావసర వస్తువులు ధరలు, పిల్లల చదువులు, ఫీజులు విపరీతంగా పెరగడంతో చాలీచాలని ఆదాయంతో బతుకుతున్న ఆటో డ్రైవర్ల జీవనం దుర్భరంగా మారిందన్నారు. మరోవైపు.. మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్టు జీవో 21, 31 జారీ చేసిన ప్రభుత్వం.. డ్రైవర్లపై అక్రమ కేసులు రాస్తూ వాహనాలను సీజ్ చేయడం, అధికంగా జరిమానాలు విధించడం వల్ల ఆటో డ్రైవర్లు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారని అవేదన వ్యక్తం చేశారు. ఆటోమొబైల్ రంగ కార్మికుల సంక్షేమం కోసం ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పిస్తూ కార్మిక సంక్షేమ చట్టాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరసనలో భాగంగా సీతమ్మధార కూడలి నుంచి హెచ్‌బీ కాలనీ వరకు ఆటోలతో ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు అడ్డూరు శంకర్, ఎస్.మధురెడ్డి, లంక గోవింద్, పి.కృష్ణంనాయుడు, శ్రీను, దల్లి నాని, ఎం.సింహాచలం, చిన్నకేలం శివ, వై. వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

స్ప్రీ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

- ఈఎస్ఐ కార్పొరేషన్ ఉప ప్రాంతీయ కార్యాలయం ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్ సౌమేంద్ర కుమార్

అక్కయ్యపాలెం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర ప్రాంతాల్లోని ప్రైవేటు యజమానులు స్ప్రీ పథకాన్ని (ఉద్యోగులు, యాజమాన్యాల నమోదును ప్రొత్సహించే పథకం) సద్వినియోగం చేసుకోవాలని ఈఎస్ఐ కార్పొరేషన్ ఉప ప్రాంతీయ కార్యాలయం ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్ సౌమేంద్ర కుమార్ సాహూ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హిమచల్ ప్రసాద్, సిమ్లాలో కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన, యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రి డాక్టర్ మనుక్ మాండవీయ అధ్యక్షతన జరిగిన ఈఎస్ఐ కార్పొరేషన్ 196వ సమావేశంలో స్ప్రీ 2025 పథకాన్ని కార్మిక రాజ్య బీమా సంస్థ (ఈఎస్ఐసీ) ఆమోదించిందని తెలిపారు. ఈఎస్ఐ చట్టం ప్రకారం సామాజిక భద్రతా కవరేజీని విస్తరించడమే ఈఎస్ఐసీ ఆమోదించిన స్కీం ఫర్ ప్రమోషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎంప్లాయర్స్, ఎంప్లాయిస్ (స్ప్రీ) 2025 లక్ష్యమన్నారు. ఇప్పటి వరకు నమోదు చేసుకోని యాజమాన్యాలు, ఒప్పంద, తాత్కాలికంగా పని చేస్తున్న వారితో సహా ఉద్యోగులందరూ ఎలాంటి తనిఖీలు పాత బకాయిలతో సంబంధం లేకుండా రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశాన్ని ఈ పథకం కల్పిస్తుందన్నారు.

జగన్నాథపురంలో అన్న సమారాధన

అక్కయ్యపాలెం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 43వ వార్డు జగన్నాథపురంలోని షిర్డీ సాయిశ్వర సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన గురుపౌర్ణమి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీజేపీ నాయకురాలు శ్యామలా దీపిక అన్నసమారాధన ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడుబొడ్డేటి మోహనరావు, గౌరీసంఘం సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి నుంచి డాక్టర్ నికితకు గోల్డ్ మెడల్



ద్రౌపది ముర్ము నుంచి సర్టిఫికెట్ తీసుకుంటున్న డాక్టర్ నికిత

విశాఖపట్నం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): విశాఖకు చెందిన డాక్టర్ కటారు నికిత రాష్ట్రపతి చేతులమీదుగా గోల్డ్ మెడల్ అందుకున్నారు. భువనేశ్వర్‌లోని ఎయిమ్స్ కాలేజీలో అప్తమాలజీ చదివిన నికితకు గోల్డ్ మెడల్ రావడంతో ఈ నెల 14న నిర్వహించిన కాన్వొకేషన్‌లో రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. ప్రస్తుతం ఆమె న్యూఢిల్లీలోని ఎయిమ్స్ కాలేజీ గైనకాలజీలో పోస్టు గ్యాడ్యుయేషన్ (చివరి సంవత్సరం) చేస్తున్నారు. నికిత సీతమ్మధారకు చెందిన ప్రముఖ లేప్రోస్కోపిక్, బేరియాట్రిక్ సర్జన్ డాక్టర్ రమేశ్‌నాయుడు, ప్రసూతి, గైనకాలజీ డాక్టర్ సునందరాణీల కుమార్తె. ఆమె విశాఖలోని శ్రీప్రకాశ్ విద్యానికేతన్‌లో స్కూలింగ్, చైతన్య జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. రోబోటిక్ సర్జరీ పట్ల ప్రత్యేక ఆసక్తి ఉందని, ఫెలోషిప్ పూర్తి చేసి విశాఖలోనే ప్రజలకు సేవలు అందిస్తానని ఆమె పేర్కొన్నారు.

సంక్రాంతి నాటికి టిడ్కో గృహాలు

... 5వ పేజీ తరువాయి

ఇక్కడకు రావడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఆదేశాలతో పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు, స్థానిక నాయకులు గంధం వెంకటరావు, కసిరెడ్డి సత్యనారాయణ, గడసాల అప్పారావు, తిప్పల రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం దర్జాగా కబ్జా

... 5వ పేజీ తరువాయి

గురువారం సర్వే చేపట్టారు. ఆర్ఐ కోమలి, వీఆర్వో సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జీవీఎంసీ సర్వేయర్ కుమారస్వామి, రెవెన్యూ సర్వేయర్ రాజగోపాల్ సర్వే నిర్వహించి ఈ నిర్మాణం పూర్తిగా కొండపోరంబోకు స్థలంలో ఉందని నిర్ధారించారు. అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తామని చెప్పి వెళ్లిపోయారు. రాజకీయ ఒత్తిళ్లు వస్తున్నాయనే ఊహాగానాల నేపథ్యంలో ఈ నిర్మాణాన్ని తొలగిస్తారా? లేదా? అనే విషయంపై సందేహాలు వ్యక్తమౌతున్నాయి.

మెట్రో కారిడార్-1, 3లో 312 గృహాలకు నష్టం

... 5వ పేజీ తరువాయి

నష్టపోవలసి ఉంటుందని వివరించారు. కారిడార్-3లో మొత్తం 26 ఇళ్లు పోతాయన్నారు. వీటికి సంబంధించిన సలహాలు, సూచనలు ప్రజల నుంచి అడిగి తెలుసుకున్నారు. వాటన్నిటినీ ఒక పుస్తకంలో నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐఏ సామాజిక, పర్యావరణ నిపుణులు మాధవరెడ్డి, స్పెషల్ డిప్యూటీకలెక్టర్ సుధాసాగర్, డిప్యూటీ తహశీల్దార్ పద్మావతి, సర్వేయర్లు, ఆర్ఐలు, మెట్రో రైలు ప్రాజెక్టు ఇంజనీర్ ఎస్.వసంత్, పరదేశిబాబు, లక్ష్మణ్‌లు పాల్గొన్నారు.

'సఫాయిమిత్ర సురక్షిత్' కేటగిరీలో జీవీఎంసీ

... 5వ పేజీ తరువాయి

జీవీఎంసీకి సఫాయిమిత్ర సురక్షిత్ షెహర్ కేటగిరీలో మొదటి ర్యాంకు లభించింది. ఈ సందర్భంగా మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ నగర ప్రజల సహకారం, జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు, అధికారులతోపాటు కార్పొరేటర్ల కృషి కారణంగానే జీవీఎంసీకి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందన్నారు. ఇదే స్ఫూర్తితో వచ్చే ఏడాది స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీలో మరింత ఉత్తమ ప్రతిభ కనబరిచేందుకు కృషిచేస్తామని ఆశాభావం వ్యక్తంచేశారు. కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ వచ్చే ఏడాది స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీ కోసం ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించుకుని అధికారులు, ప్రజలను భాగస్వాములను చేస్తూ ముందుకువెళతామన్నారు. ఇదిలావుండగా స్వచ్ఛ సర్వేక్షణ్-2025 పోటీలో అవార్డు అందుకున్న వారిలో జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈఎస్‌వీ నరేష్‌కుమార్, చీఫ్ ఇంజనీర్ పల్లంరాజు ఉన్నారు.

దారితప్పిన దర్యాప్తు

... 5వ పేజీ తరువాయి

వెళ్లి విచారణ జరిపారు. గత నెల 30న ఏలూరు జిల్లాకు చెందిన ఇద్దరు వ్యక్తులకు గది బుక్ చేసిన వైద్యుడు డాక్టర్ ఆనంద్, ఈ ఏడాది జనవరిలో ఒడిశాకు చెందిన ముగ్గురికి అదే హోటల్‌లో రూమ్ బుక్ చేసినట్టు తేలింది. పైగా ఆ ముగ్గురు మూడు రోజులు హోటల్‌లోనే ఉండి తర్వాత బిల్లు చెల్లించకుండా వెళ్లిపోవడంతో రూమ్ బుక్ చేసిన డాక్టర్ ఆనంద్‌ను సిబ్బంది సంప్రతించగా, స్పందించలేదని తేలింది. ఈ నేపథ్యంలో రూమ్ తీసుకున్న వైద్యుడు బిల్లు చెల్లించలేదనిసిబ్బంది వద్ద ఫోర్త్‌టౌన్ పోలీసులుఫిర్యాదు తీసుకుని బుధ వారం కేసు నమోదుచేశారు. అంతేతప్ప డాక్టర్ ఆనంద్ గతంలో ముగ్గురు వ్యక్తులను ఒడిశా నుంచి ఎందుకు రప్పించారు?, ఇప్పుడు మరో ఇద్దరిని ఎందు కు రప్పించారు?...అనే విషయాలను విస్మరించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మహా నిరాశ

... 5వ పేజీ తరువాయి

చెత్త నిర్వహణ వంటి అంశాలను నేరుగా పరిశీలిస్తాయి. ఉత్తమ ఫలితాలు సాధించిన నగరాలకు అవార్డులు అందజేస్తుంది. 2016లో దేశవ్యాప్తంగా 73 నగరాలు స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీలో పాల్గొంటే జీవీఎంసీ ఐదో ర్యాంకు దక్కించుకుంది. 2017లో 434 నగరాలు పాల్గొంటే మూడో ర్యాంకు దక్కించుకుంది. 2018లో 4,203 నగరాలు పోటీ పడితే పది లక్షల పైబడి జనాభా కలిగిన నగరాల కేటగిరీలో జీవీఎంసీ ఏడో ర్యాంక్ దక్కించుకుంది. 2019లో 4,237 నగరాలు పోటీపడితే 23, 2020లో 4,242 నగరాలు పోటీపడగా 9, 2021లో 4,320 నగరాలు పోటీపడితే 9, 2022లో 4,354 నగరాలు పోటీపడితే 4, 2023లో 4,416 నగరాలు పోటీపడితే నాలుగో ర్యాంకు దక్కింది. అయితే 2024లో 4,589 నగరాలు పోటీపడగా జీవీఎంసీ తొమ్మిదో ర్యాంకుకు దిగజారిపోయింది.

జీవీఎంసీకి ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకూ పూర్తిస్థాయి కమిషనర్ లేకపోవడం వల్లనే స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జీవీఎంసీ వెనుకబడిందని కొందరు అధికారులు అభిప్రాయపడుతున్నారు. మరికొందరు అధికారులు మాత్రం స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే బృందాలు ఈ ఏడాది ఫిబ్రవరిలోనే నగరంలో పర్యటించాయని, దానికి, పూర్తిస్థాయి కమిషనర్ లేకపోవడానికి సంబంధం లేదని పేర్కొంటున్నారు. అధికారుల్లో ఉదాసీనత పెరిగిపోవడం, క్షేత్రస్థాయిలో కొందరు సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహించడంతో నగరంలో పారిశుధ్యం క్షీణించిందని, అదే ర్యాంకు దిగజారడానికి కారణమని పేర్కొంటున్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో దిగజారడానికి అనేక కారణాలు

స్వచ్ఛ సర్వేక్షణ్-2024లో మొత్తం 12,500 మార్కులకు పోటీ నిర్వహించారు. వీటిలో డోర్ టూ డోర్ చెత్త సేకరణ, విభజన, చెత్తను సంపదగా మార్చడం, పునర్వినియోగానికి వీలుగా చెత్తను మార్చే వనరులను అందుబాటులోకి తేవడం, క్షేత్రస్థాయిలో మార్కెట్లు, రోడ్లు, జనావాసాలు, ప్రజా మరుగుదొడ్లు, గెడ్డలను శుభ్రంగా ఉంచడానికి సంబంధించి పది వేల మార్కులు కేటాయించగా, యార్డులో చెత్త నిల్వలు లేకుండా చేయడం, బహిరంగ మలవిసర్జన నిర్మూలించడం, మురుగునీటిని శుద్ధి చేసి పునర్వినియోగానికి వాడడం వంటి విభాగాల్లో సాధించిన సర్టిఫికెట్‌లకు 2,500 మార్కులు కేటాయించారు. అయితే జీవీఎంసీకి చెందిన కాపులుప్పాడలోని డంపింగ్ యార్డులో చెత్తకుప్పలను బయో మైనింగ్ ద్వారా పునర్వినియోగానికి వీలుగా తయారుచేయడం, అక్కడ భూమిని ఖాళీ చేసి పచ్చదనం పెంపు దిశగా పనులు జరుగుతున్నాయి. 2025 జనవరి నాటికి యార్డులో చెత్తలేకుండా చేయాల్సి ఉండగా, ఇంకా 20 శాతానికిపైగా అలాగే ఉండిపోవడంతో గార్బేజ్ ఫ్రీసిటీ (జీఎఫ్‌సీ)లో ఫైవ్ స్టార్ ర్యాంకు సర్టిఫికెట్ మాత్రమే కేంద్రం జారీచేసింది. సూపర్ స్వచ్ఛ లీగ్‌లో స్థానం దక్కించుకున్న విజయవాడ, గుంటూరు, తిరుపతి నగరాలతోపాటు స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జీవీఎంసీ కంటే మెరుగైన ర్యాంకులు సాధించిన నగరాలన్నీ జీఎఫ్‌సీలో సెవెన్ స్టార్ ర్యాంకులను దక్కించుకున్నాయి. దీనివల్ల జీవీఎంసీ 2,500 మార్కులకు గాను కేవలం 2,300 మార్కులు మాత్రమే దక్కించుకుంది. అలాగే డోర్ టూ డోర్ చెత్తసేకరణ నగరంలో 96 శాతం మాత్రమే జరుగుతుండడం, తడి పొడి చెత్తవిభజన 81 శాతం మాత్రమే జరగడం, జోన్ స్థాయిలో ఉన్న డంపింగ్ యార్డుల్లో చెత్తను ఏరోజుకారోజు యార్డుకు తరలించే ప్రక్రియ 98 శాతం మాత్రమే జరగడం, ప్రజా మరుగుదొడ్ల పరిశుభ్రతలో 97 శాతానికే పరిమితం కావడం వంటి కారణాల వల్ల పది వేల మార్కులకు 9,336 మార్కులే వచ్చాయి. దీంతో మొత్తం 12,500 మార్కులకు 11,636 మార్కులను దాటలేకపోయింది. దీనివల్ల పదిలక్షల జనాభా కలిగిన నగరాల కేటగిరిలో జీవీఎంసీ తొమ్మిదో ర్యాంకుకు దిగజారిపోవాల్సి వచ్చింది.



కమిషన్ సభ్యుడు రామచంద్రకు ఫిర్యాదు చేస్తున్న విదసం సభ్యులు

ఎస్సీ కమిషన్ సభ్యుడికి 'విదసం' వినతి

డాబాగార్డెన్స్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ కమిషన్ ఆదేశాలను పాటించని అధికారులపై అట్రాసిటీ చట్టం సెక్షన్ 4 కింద కేసులు పెట్టాలని విదసం ఐక్యవేదిక సభ్యులు కోరారు. గురువారం వారు విశాఖ వచ్చిన జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచంద్రను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విదసం రాష్ట్ర కన్వీనర్ బూసి వెంకటరావు మాట్లాడుతూ తెనాలిలో దళిత యువకులను నడిరోడ్డు మీద కొట్టిన ఘటనలో పోలీసులపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కించడం సరికాదన్నారు. మల్లంలో సాంఘిక బహిష్కరణ జరిగితే కనీసం కేసు కూడా నమోదు చేయలేదని, గత ఏడాది విశాఖ సెంట్రల్ జైల్లో జరిగిన గౌరీ శంకర్ కాస్టోడియల్ డెత్‌లో బాధ్యులపై చర్యలు తీసుకోలేదని తెలిపారు. కార్యక్రమంలో మల్లం మృతుడు సురేశ్ భార్య మణి, కస్టడీయాల్ మృతుడు గౌరీ శంకర్ తల్లి ఉప్పాడ నర్సయ్యమ్మ, విదసం నాయకులు జాజి ఓంకార్, బి. భాస్కరరావు, జి. ప్రసాద్, వీఎం ఫ్రాన్సిస్, ఎ. మంగరాజు, జి. బ్రహ్మజీ తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు విగ్రహం ఏర్పాటుకు చర్యలు

డాబాగార్డెన్స్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : అమరావతిలో 58 అడుగుల పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్, జనసేన నాయకురాలు కొల్లూరు రూప తెలిపారు. గురువారం ఆమె డాబాగార్డెన్స్‌లోని కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు హామీ మేరకు శాఖమూరు పార్కులో 6.8 ఎకరాలను పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్‌కు సీఆర్డీయే ద్వారా ప్రభుత్వం కేటాయించిందన్నారు. అక్కడ పొట్టి శ్రీరాములు భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. అమరజీవి స్మృతివనం భవిష్యత్తులో ప్రముఖ పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందనుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కోటవీధిలో 'తొలి అడుగు'



స్థానికులతో మాట్లాడుతున్న సీతంరాజు

మహారాణిపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : అర్హత ఉండి సంక్షేమ పథకాలు రాని వారు పూర్తి వివరాలతో తనను సంప్రతిస్తే పథకాలు వచ్చేలా కృషి చేస్తానని టీడీపీ దక్షిణ నియోజకవర్గం ఇన్‌చార్జి, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు చైర్మన్ సీతంరాజు సుధాకర్ చెప్పారు.. గురువారం ఆయన వన్‌టౌన్ కోటవీధి ప్రాంతంలో జరిగిన సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో మాట్లాడారు. ఇంటింటికి వెళ్లి ఏడాది పాలనలో ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం క్వీన్‌మేరీ గర్ల్స్ హైస్కూల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినికి రూ.10 వేల నగదు బహుమతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

మహారాణిపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పలు కూడళ్లల్లో పోలీసులు గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. మద్యం తాగి వాహనం నడుపున్న వారిపై కేసులు నమోదు చేశారు. అలాగే నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసిన వారి వాహనాల రికార్డులను పరిశీలించారు మొత్తం 35 కూడళ్లల్లో 619 వాహనాలను తనిఖీ చేశారు.

మంత్రి లోకేశ్, ఎంపీ శ్రీభరత్ చొరవతో స్వదేశానికి చేరిన యువత



విదేశాల్లో చిక్కుకున్న యువకులతో ఎంపీ శ్రీభరత్

భీమునిపట్నం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : కంబోడియాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు వెళ్లి మోసపోనయిన ఉత్తరాంధ్రకు చెందిన ఇద్దరు యువకులు మంత్రి నారా లోకేశ్, ఎంపీ శ్రీభరత్ చొరవతో స్వదేశానికి క్షేమంగా చేరారు. భీమునిపట్నంలోని 4వ వార్డు జేవీ అగ్రహారం గ్రామానికి చెందిన మీసాల ఆదిబాబు (32), శ్రీకాకుళం జిల్లా గార మండలం బోరవానిపేట గ్రామానికి చెందిన బోగి వినయ్ గత ఏడాది సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల కోసం కంబోడియా వెళ్లారు. అక్కడ సైబర్ నేరగాళ్ల చేతితో మోసపోయి ఉద్యోగాలు లేక నానా అవస్థలు పడ్డారు. తిండి లేక నరకయాతన అనుభవిం చారు. ఈ విషయాన్ని బాధిత కుటుంబీకులు భీమిలికి చెందిన టీడీపీ నాయుడు వానపల్లి సత్య కు చెప్పడంతో ఆయన గతనెల 22న ఎంపీ శ్రీభరత్ దృష్టికి తీసుకువెళ్లారు. ఎంపీ ఈ విషయాన్ని మంత్రి లోకేశ్‌కు తెలిపారు. సత్వరమే స్పందించిన లోకేశ్ అధికారుల ద్వారా వివరాలు తీసుకుని కేంద్రంలోని సంబంధిత శాఖాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఎట్టకేలకు మంగళవారం రాత్రి ఆ ఇద్దరు యువకులు నగరానికి చేరుకున్నారు. వారిని పార్టీ నాయకుడు సత్య ఎంపీ దగ్గరకు తీసుకువెళ్లారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలంటే కంబోడియాకు వెళ్లామని, అక్కడ మోసపోయి పడిన కష్టాలను ఎంపీతో చెప్పి కన్నీటి పర్వంతమయ్యారు.



ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న పీవీఎన్ మాధవ్

ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ భేటీ

సీతమ్మధార, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజును బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధి, పార్టీని బలపరిచే కార్యక్రమాలు, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై చర్చించారు. పార్టీ కార్యకలపాలను మరింత చురుగ్గా ముందుకు తీసుకువెళ్లే దిశగా నాయకులను ప్రోత్సహించి, భవిష్యత్తు కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామ్ రాజు, నాయకులు శ్యామలదీపిక, సునీల్, నాగేంద్ర, సుబ్బిరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నలుగురు అరెస్టు

మహారాణిపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో డాబాగార్డెన్స్ వద్ద ఆదివారం అర్ధరాత్రి జరిగిన హత్య కేసుకు సంబంధించి నలుగురిని అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. జగదాంబ జంక్షన్ వద్ద నివాసం ఉంటున్న శెట్టి ఎల్లాజీ (21) స్విగ్గీలో డెలివరీ బాయ్‌గా పని చేసేవాడు. ఆదివారం అర్ధరాత్రి 1 గంట సమయంలో ఎల్లాజీ, అయప్ప అనే తన స్నేహితు డు, మరో ముగ్గురితో కలిసి మద్యం సేవించాడు. అనంతరం వారి మధ్య చిన్నపాటి వివాదం జరిగింది. ఈ గొడవలో మిగతా ముగ్గురు ఎల్లాజీపై కత్తితో దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. ఈ మేరకు నిందితులు సాలిపేటకు చెందిన గోలగాని చరణ్ అలియాస్ అయ్యప్ప, గోరుగుబల్లి దుర్గా ప్రసాద్ అలియాస్ యాసిడ్ దుర్గా, కోన పృథ్వీ అలియాస్ పండు, ఆరిలోవకు చెందిన మణికంఠ సాయిని పోలీసులు గురువారం అరెస్టు చేశారు.

నూతన పరికరాలు ప్రారంభం

మహారాణిపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : కేజీహెచ్‌లోని యూరాలజీ విభాగంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన నూతన పరికరాలను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, ఏఎంసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి గురువారం ప్రారంభించారు. 4కె ల్యాప్రోస్కోప్ సిస్టమ్, హఆల్మియం లేజర్లు, థ్యూలియం లేజర్లు, యూరో డైనిమిక్స్ యంత్రాలను అందుబాటులోకి తీసుకువచ్చారు.

కేన్సర్‌పై అవగాహన అవసరం

మహారాణిపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : హెచ్‌పీవీ వ్యాక్సిన్‌తో మహిళల్లో కేన్సర్‌ను నియంత్రించవచ్చునని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆయన క్వీన్‌మేరీ పాఠశాలలో హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, ఆచార్య వెలగపూడి ఉమామహేశ్వరరావు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు రవిచంద్ర, హరనాథ్ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

పారా అథ్లెటిక్స్ టోర్నీ పోస్టర్ ఆవిష్కరణ

విశాఖపట్నం, స్పోర్ట్సు, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : పారా స్పోర్ట్సు ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో వచ్చే నెల 9న జరగనున్న సబ్ జూనియర్, జూనియర్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ టోర్నీ ప్రచార పోస్టర్‌ను పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. నగరంలోని పోలీసు బ్యారక్ గ్రౌండ్‌లో జరగనున్న జూనియర్, సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఒకరోజు పాటు జరిగే ఈ మీట్‌లో ప్రతిభ చూపిన అథ్లెట్లు జాతీయ పారా అథ్లెటిక్స్ టోర్నీలో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని కమిషనర్‌కు నిర్వాహకులు వివరించారు. కాగా ఈ టోర్నీలో పాల్గొనేందుకు ఆసక్తి గల వారు ఈనెల 28లోగా పారా స్పోర్ట్సు ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వి.రామస్వామి ఫోన్ : 96901 31777లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నిర్వాహకులు శీతల్ మదన్, టి.రాము పాల్గొన్నారు.

'చైతన్య స్రవంతులు' పుస్తకాల ఆవిష్కరణ

సీతంపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ద్వారకానగర్‌లో గల పౌరగ్రంథాలయంలో అరసం, అమరావతి పబ్లికేషన్ గుంటూరు నిర్వహణలో చలం స్త్రీ రచన జయంతి పేరిట ఆచార్య చలం రాసిన చైతన్య స్రవంతులు పుస్తకాలు స్త్రీ, భగవాన్ స్మృతులు, పిల్లల కోసం (నాటికలు, చిన్న కథలు) పుస్తకాల ఆవిష్కరణను గురువారం నిర్వహించారు. అరసం కార్యదర్శి ఉప్పల అప్పలరాజు నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దేవి సీ ఫుడ్స్ ప్రైవేటు లిమిటెడ్ డైరెక్టర్ గద్దె సాంబశివరావు చేతుల మీదుగా పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలం ప్రశ్నించే గుణాన్ని కొనియాడారు. నవయవ్వనం, చుక్కమ్మ కథలను విశ్లేషించారు. ఈ సభకు సభాధ్యక్షులుగా వ్యవహరించిన ప్రముఖ సాహితీవేత్త మేడా మస్తాన్ రెడ్డి ఉపన్యసిస్తూ చలం సాహిత్య కార్యక్రమానికి అధ్యక్షత వహించడం అదృష్టమన్నారు. ప్రత్యేక అతిథిగా అరసం కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ సభకు అభినందనలు తెలిపారు.

ప్రజల సమస్యలు తెలుసుకోండి

» 'సుపరిపాలనలో తొలి అడుగు'లో పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల, చేస్తున్న అభివృద్ధి గురించి ప్రజలకు తెలియజేయాల్సి బాధ్యత కార్యకర్తల పై ఉందని ఎమ్మెల్యే గణబాబు అన్నారు. జీవీఎంసీ 60వ వార్డు ఇందిరాకాలనీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి పాలన అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలు సంతోషంగా ఉన్నారిన తెలిపపారు. ప్రతి పథకాన్ని క్రమం తప్పకుండా అమలుచేస్తూ ప్రజా మన్ననలు పొందుతున్నామని తెలిపారు. వైసీపీ హయాంలో అడుగడుగునా అవినీతే జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాది కూటమి ప్రజలకు చేసిన మంచిని వివరించారు. ముఖ్యంగా త్వరలోనే టిడ్కో ఇళ్ల మంజూరు కోసం ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. వైసీపీ తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొట్టాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

అభివృద్ధి చూడండి... ఆశీర్వదించండి

కూర్మన్నపాలెం (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి' అంటూ 86 వార్డు టీడీపీ అధ్యక్షుడు నల్లూరు సూర్య నారాయణ అన్నారు. గురువారం వార్డులోని సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి అడుగులు వేస్తూ, పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పాలన అందిస్తోందని అన్నారు. ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకుని కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు

వైభవంగా దుర్గమాంబ జాతర

పెందుర్తి, జూలై 17(ఆంధ్రజ్యోతి): సరిపల్లి ప్రజల ఆరాధ్య దేవత దుర్గమాంబ పండుగ గురువారం వైభవంగా జరిగింది. వేకువజామునే మహిళలు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేకంగా అంకరించి, పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సాయంత్రం అమ్మవారి ఊరేగింపు ఘనంగా జరిగింది.

ఆర్యవైశ్య నూతన కార్యవర్గం ఎన్నిక

గాజువాక, జూలై 17 (ఆంధ్రజ్యోతి): గాజువాక ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం గురువారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. సంఘం అధ్యక్షుడిగా తాళ్లూరి మల్లేశ్వర రావు, కార్యదర్శిగా కులుకూరి మంగరాజు, కోశాధికారిగా కేసారపు సతీశ్, గౌరవధ్యక్షునిగా పీవీఎస్.నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. గురువారం వాసవి కల్యాణ మండపంలో జరిగిన సభలో నూతన కార్యవర్గాన్ని సంఘం సభ్యులు అభినందించారు.

శాకాంబరి దేవిగా ముత్యాలమ్మ



శాకాంబరిగా అమ్మవారు

వేపగుంట, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఆషాడమాసం తొలి గురువారం కావడంతో స్థానిక పరిసర ప్రాంతాల ఆరాధ్య దైవం ముత్యాలమ్మ భక్తులకు గురువారం శాకాంబరి దేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి కూరగాయలు, పండ్లు, వివిధ వస్తువుతలో ప్రత్యేక అలంకరణ చేశారు. అమ్మవారికి క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

రథానికి షెడ్డు నిర్మాణం

అగనంపూడి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జగన్నాథస్వామి రథానికి నీడనిచ్చేందుకు షెడ్ నిర్మాణాన్ని దాదాపు పూర్తి చేశారు. సుమారు 40 ఏళ్లగా రథం పెట్టడానికి షెడ్ లేకపోవడంతో తాత్కాలికంగా తాటి కమ్మలతో పందిరి ఏర్పాటు చేసేవారు. దీని కారణంగా ప్రతి ఏడాది రథోత్సవాలకు మరమ్మతులు చేయించాల్సిన పరిస్థితి ఏర్పడేది. ఈ విషయాన్ని ఆలయ ట్రస్ట్ ప్రతినిధి కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లడంతో షెడ్డు నిర్మాణానికి రూ. 16 లక్షల నిధులు మంజూరు చేయించారు. మరొక రెండు రోజుల్లో షెడ్డుకు రేకులు బిగించి నిర్మాణాన్ని పూర్తి చేస్తామని జీవీఎంసీ అధికారులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అక్కిరెడ్డిపాలెం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): బీహెచ్‌పీవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి తుంగ్లాం, కణితి 11 కేడీ విద్యుత్ ఫీడర్‌ల పరిధిలో శుక్రవారం నిర్వాహణ పనులు చేపట్టనున్నట్లు జోన్ 2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బీహెచ్‌పీవీ టౌన్‌షిప్, చిట్టినాయుడు కాలనీ, దశమికొండ, పంతులుగారి మేడ, పద్మజా ఆసుపత్రి ఏరియా ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతాదని ఆయన తెలిపారు.

సినిమా గైడ్

● **తమ్ముడు** : మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక)
● **జురాసిక్ వరల్డ్** : జగదాంబ, రమాదేవి
● **కన్నప్ప** : జగదాంబ, కిన్నెర, శ్రీకన్య, లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి). లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ),
● **కుబేర** : సంగం, ఊర్వశి (కంచరపాలెం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
● **ఎఫ్.1** : రమాదేవి, జగదాంబ,
● **మార్గన్** : శారద, శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 22, టమాటా 28, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 24, పచ్చిమిర్చి 84, కాకరకాయలు 36, బీరకాయలు 28, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 22, క్యారెట్ 40, దొండకాయలు 32, బంగాళదుంపలు 17, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 58, అల్లం (పాతది) 48, బరబాటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 42, బద్దచిక్కుడు 50, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 85, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 90, కీరదోస 34, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడదుంపలు 40, కంద 54, దేముడు చిక్కుడు 70, గోరు చిక్కుడు 40, కూర పెండలం 30, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, క్రప్రెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	70
లైవ్ ధర	90
విత్ స్కిన్	150
స్కిన్‌లెస్	160

నేడు టిడ్కో గృహాల పరిశీలన



అధికారులతో సమీక్ష చేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శుక్రవారం చీమలపల్లి టిడ్కో గృహ సముదాయాలను పరిశీలన నేపథ్యంలో ఎమ్మెల్యే పంచకర్లతో టిడ్కో చైర్మన్ అజయ్‌కుమార్ గురువారం సుజాతనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని చీమలాపల్లి, పెదగంట్యాడ, అప్పికొండ, నడుపూరులో టిడ్కో సముదాలయాపై సమీక్ష చేశారు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు అప్పగించడంతో జాప్యంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జెడ్సీ హేమవతి, టిడ్కో ఏపీడీ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు .జోన్ ఆరులోని 77, 78, 79, వార్డులో అభి వృద్ధి, శానిటేషన్ పనులపై సమీక్ష నిర్వహించారు

ఆర్పీలకు ట్యాబ్‌లు పంపిణీ



ఆర్పీలకు ట్యాబ్‌లు అందజేస్తున్న కార్పొరేటర్ పులి లక్ష్మిబాయి

పెదగంట్యాడ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 75వ వార్డులో 14మంది ఆర్పీలకు వార్డు కార్పొరేటర్ ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులైన వారందరికీ అందేలా చూసుకోవాలని ఆర్పీలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, ఆర్పీలు పాల్గొన్నారు.

బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

మల్కాపురం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురం మహాత్మ గాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న షర్డీసాయిబాబా ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే గణబాబు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో అన్నసమారాధన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో భక్తి ఉండాలని, అప్పుడు అందరికీ మంచి జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ, కూటమి నాయకులు భక్తులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో షిర్డీసాయి బాబా.

అగనంపూడి (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డులో షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామి వారికి నూతన ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామి వారికి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సేవా సమితి ఆర్థికసాయంతో అన్నసమారాధన చేశారు. సాయంత్రం భజనా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

అశోక్‌కు మాధవ్ అభినందనలు



అశోక్‌గజపతిరాజుతో పీవీఎన్ మాధవ్, తదితరులు

విశాఖపట్నం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గోవా గవర్నర్‌గా నియమితులైన పూసపాటి అశోక్‌గజపతిరాజును బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్.మాధవ్ గురువారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. విజయనగరంలోని అశోక్ బంగ్లాలో ఆయనను కలిసి అభినందనలు తెలిపిన వారిలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాలం, విశాఖ జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎన్ పరశురామరాజు, విజయనగరం జిల్లా అధ్యక్షుడు రాజేశ్ వర్మ ఉన్నారు.

బాలికలకు చెస్ బోర్డులు పంపిణీ

విశాఖపట్నం, జూలై 17(ఆంధ్రజ్యోతి): ప్రపంచ చెస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నగరంలోని ప్రభుత్వ బాలికల వసతిగృహాన్ని ఆంధ్రా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేశ్ అడుసుమిల్లి, ఇండియన్ కోస్ట్‌గార్డ్ డిప్యూటీ కమాండెంట్ అకిల్ పఠాని సందర్శించారు. ఈ సందర్భంగా వసతిగృహంలోని బాలికలకు చెస్ బోర్డులు, విద్య, సాహిత్యం పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం సురేశ్ అడుసుమిల్లి మాట్లాడుతూ అనాథ లు, అవకాశాలు లేని పిల్లలకు చెస్ గేమ్‌ను పరిచయం చేసి వారికి దీర్ఘకాలంగా ఆంధ్రా చెస్ అసోసియేషన్ అండగా ఉంటుందన్నారు. వసతిగృహంలోని బాలికలకు నిరంతరం చెస్ బోర్డులు, చెస్ నేర్చుకునేందుకు అవసరమైన వనరులను సమకూరుస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సహకారాన్ని అందించిన కెన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పి.సంతోశ్ మాట్లాడుతూ చెస్ మన ఆలోచనా ధోరణిని మారుస్తుందని, మనసును ప్రశాంతంగా ఉంచు తుందన్నారు. కార్యక్రమంలో వసతి గృహం సూపరింటెండెంట్ చిలుకనయోమి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పెందుర్తి, జూలై 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక, ప్రాథమికోన్నత 19 పాఠశాలల్లో 2,700 మంది విద్యార్థులకు తొలి విడతగా 18 వేల నోటు పుస్తకాలను, పెన్నులు, పెన్సిళ్లి, జామెట్రి బాక్సులను గురువారం అక్షర భారతి చారిటబుల్ ట్రస్ట్ వితరణ చేసింది. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు నెల్లూరు ప్రసాద్ మాట్లాడుతూ 2009 నుంచి విద్యార్థులకు స్టేషినరీ అందిస్తున్నామని తెలిపారు. పదోతరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల విద్యార్థులకు ఏటా నగదు ప్రోత్సహకాలు అందిస్తున్నామని తెలిపారు. తమ సేవలను గుర్తించి మరింత మంది సేవ చేయడానికి వస్తున్నారని అన్నారు.

పార్కులో జిమ్, లైటింగ్ ఏర్పాటు

ఎన్.ఎ.డి.జంక్షన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 52వ వార్డు శాంతినగర్ పార్క్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన జిమ్, లైటింగ్ తదితర సదుపాయాలను మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కులో అత్యాధునికి జిమ్ పరికరాలు, లైటింగ్ తదితర పనులకు రూ.45లక్షల జీవీఎంసీ నిధులు విడుదల చేసిందని తెలిపారు. స్థానిక ప్రజలకు ఈ పార్కు ఆహ్లాదాన్ని పంచనుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నకిలీ పత్రాలతో స్థలం విక్రయం

» ఇద్దరి అరెస్టు

కొమ్మాది, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : నకిలీ పత్రాలతో స్థలాన్ని విక్రయించిన ఇద్దరిని అరెస్టు చేసినట్టు నార్త్ జోన్ ఏసీపీ అప్పలరాజు తెలిపారు. గురువారం రాత్రి ఆయన పీఎంపాలెం పోలీస్‌స్టేషన్‌లో విలేకరు లతో మాట్లాడారు. మల్కాపురానికి చెందిన దంపతులు వాడుకల మణికుమారి, ప్రసాదరావు ఉద్యోగరీత్యా ఖతర్‌లో ఉంటున్నారు. నగరంలో స్థలం కొనుగోలు చేయాలన్న ఉద్దేశంతో వారు ఫేస్‌బుక్‌లో వెతుకుతుండగా పిల్లి అశోక్ పరిచయమయ్యాడు. ఆయన రియల్ ఎస్టేట్ ఏజెంట్‌గా ప్రసాదరావును పరిచయం చేసుకుని, ఎజ్జల శ్రీనివాస్ అలియాస్ దుబాయ్ శ్రీనును ఎమ్మతేజ్ గ్రూప్ అధినేతగా పరిచయం చేశాడు. తాము విదేశాల్లో ఉన్న వారికి స్థలాలు కొనడం, అమ్మడం చేస్తుంటామని వారిని నమ్మించి మధురవాడలోని టీచర్స్ లేఅవుట్‌లో ఉన్న స్థలాలను చూపించారు. ఆ స్థలం కొండేటి మీనాక్షి, రూప్‌కుమార్ పేరుతో ఉందని, వారి తల్లిదండ్రులకు వారే అసలైన వారుసులని చెప్పారు. ఆన్‌లైన్‌లో చెబితే మాకు నమ్మకం ఏమిటని ప్రసాదరావు ప్రశ్నించగా ముందు స్థలం రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తామని, ఆ తరువాత డబ్బులు ఇవ్వొచ్చని చెప్పి టీచర్స్ లేఅవుట్‌లోని 155 చదరపు గజాల స్థలాన్ని మణికుమారి పేరుతో రిజిస్ట్రేషన్ చేయించి డాక్యుమెంట్లను పంపించారు. ఈమేరకు ప్రసాదరావు దఫదఫాలుగా దుబాయ్ శ్రీను అకౌంట్‌కి 53,78,875 రూపాయలు పంపించారు. ఇది తతంగం మొత్తం గత ఏడాది జూలై, ఆగస్టు నెలల్లో జరిగింది. ప్రసాదరావు దంప తులు ఇటీవల విశాఖ వచ్చి తమ స్థలం చూసుకోవడానికి మధురవాడ రాగా స్థలం అమ్మినవారికి స్థలానికి ఎలాంటి సంబంధం లేదని గ్రహించారు. పీఎంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీపీ ఆదేశాల మేరకు సీఐ బాలకృష్ణ, ఎస్ఐ భాస్కరరావు కేసు దర్యాప్తు చేసి, దుబాయ్ శ్రీను, పిల్లి అశోక్‌ను అదుపులోకి తీసుకు న్నారు. కాగా కొండేటి రూప్‌కుమార్, నిమ్మగడ్డ నాగేశ్వరరావు, కొల్లిపర వెంకట దినకర్ స్థలాలకు నకిలీ పత్రాలు సృష్టించి, మొత్తం 900 గజాలను 150 గజాల చొప్పున విభజించి అందులో ఒక భాగాన్ని ప్రసా దరావుకు విక్రయించారు. మిగిలిన వాటిని వేరే వ్యక్తులకు అమ్మచూపారు. పోలీసులు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

రిజర్వేషన్ ప్రకారం పదోన్నతులు కల్పించాలి

» జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్



భెల్ హెచ్‌పీవీపీలో అధికారులతో కేంద్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్

అక్కిరెడ్డిపాలెం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : భెల్ హెచ్‌పీవీపీలో కార్మికుల పదోన్నతులు, నూతన ఉద్యోగుల భర్తీలో రిజర్వేషన్ రోస్టర్ పాయింట్‌లను సక్రమంగా అమలుచేయాలని కేంద్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ భెల్ అధికారులకు సూచించారు. భెల్ హెచ్‌పీవీపీలో అధికారులు, ఎస్సీ ఉద్యోగుల సంఘం నాయకులతో గురువారం ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా కార్మికుల పదోన్నతుతలో ఎస్సీ రిజర్వేషన్‌ను సక్రమంగా అమలు చేయాలని, డీగ్రేడ్ చేసిన ఇద్దరు కార్మికులకు తిరిగి పదోన్నతులు కల్పించాలని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దేముడు కోరారు. అనంతరం యాజమాన్యంతో చర్చించిన రామచందర్ కర్మాగారంలో రిజర్వేషన్ అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. పదోన్నతులలో రిజర్వేషన్ సక్రమంగా అమలు చేయాలని ఆయన అధికారులకు సూచించారు.

ఉక్కుటౌన్‌షిప్, (ఆంధ్రజ్యోతి): విశాఖ పర్యటనకు విచ్చేసిన జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్‌ను స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ సభ్యులు గురువారం హెచ్‌పీసీఎల్ అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే ఉంచాలని, ప్లాంట్‌లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రధాన సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, ఎస్సీ, ఎస్టీ కాంట్రాక్టు కార్మికులను తొలగించవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు పాల్గొన్నారు.

వందేభారత్‌కు దువ్వాడలో హాల్టు కల్పించాలని వినతి

కూర్మన్నపాలెం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ వెళ్లే వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు దువ్వాడలో హాల్టు కల్పించాలని తూర్పుకోస్తా రైల్వే కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్ రైల్వే ఉన్నతాధికారులకు లేఖ పంపారు. ప్రతి రోజు తెల్లవారు జామున బయలు దేరే రైలుకు అందుకోవాలంటే గాజువాక ప్రజలు పారిశ్రామిక ప్రాంతం నుంచి రవాణా సౌకర్యం లేదని, ప్రతిరోజు 500 సీట్లు ఖాళీగా ఉండిపోతున్నాయని ఆయన లేఖలో పేర్కొన్నారు. దువ్వాడలో హాల్టు కల్పిస్తే ఖాళీగా నడపాల్సిన అవసరముండదని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. దువ్వాడలో హాల్టు విషయమై తాను ఇప్పటికే రైల్వే ఉన్నతాధికారులకు, ప్రజా ప్రతినిధులకు పలుమార్లు వినతి పత్రాలు అందజేశానని, అయినా ఉపయోగం లేదని ఆయన వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దువ్వాడలో వందేభారత్ రైలుకు హాల్టు కల్పించాలని ప్రయాణికుల తరఫున కోరుతున్నానని అన్నారు.



డీజీఎం కు వినతి పత్రం అందజేస్తున్న ఉక్కు నిర్వాసిత నాయకులు

ఉక్కు నిర్వాసితులకు న్యాయం చేయాలని వినతి

ఉక్కుటౌన్‌షిప్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ కోసం త్యాగం చేసిన నిర్వాసితులు నేడు దుర్భల జీవితాన్ని గడుపుతున్నారని, నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరుతూ డీజీఎం ఎన్.భానుకు నిర్వాసితుల కాంట్రాక్టు లేబర్ యూనియన్, నిర్వాసితుల ఐక్య సంఘం నాయకులు గురువారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను తక్షణమే తీసుకోవాలని కోరారు. నిర్మాసితులకు అన్ని విధాల అన్యాయం జరుగుతోందని, వారికి న్యాయం చేయాలని విన్నవించారు.

సంపూర్ణ వ్యక్తిత్వ వికాసమే విద్యార్థి లక్ష్యం

మల్కాపురం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ వ్యక్తిత్వ వికాసమే విద్యార్థుల లక్ష్యమని, అన్ని రంగాల్లో ప్రతిభను కనబరచాలని సెయింట్ ఆన్స్ కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా అన్నారు. కళాశాలలో మూడురోజులుగా నూతన విద్యార్థులకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలలో గురువారం ముగింపు సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి దేశానికి ఒక మానవ వనురుగా ఉపయోగపడాలని అన్నారు. భావోద్వేగాలను ఎలా నియంత్రించుకోవాలో సీనియర్ హిందీ అధ్యాపకురాలు ఏ. ఆదిలక్ష్మి, ఒత్తిడిని ఎలా అదిగమించాలో కామర్స్ అధ్యాపకురాలు పి.లావణ్య విద్యార్థులకు వివరంగా తెలియజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి మాట్లాడుతూ ఈ శిక్షణా తరగతుల వల్ల విద్యార్థులు తమ నాయకత్వ లక్షణాలకు పునాది వేసుకున్నారని అన్నారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న వారందరికీ సర్టిఫికేట్స్ పంపిణీ చేశారు.

మృతుని కుటుంబానికి చేయూత



ఆటోనగర్,జూలై 17 (ఆంధ్రజ్యోతి): కష్టాల్లో ఉన్న వారికి స్వచ్ఛంద సంస్థలు ఆదుకొని సహాయం చేయాలని రాష్ట్ర పద్మశాలి సంఘం కన్వీనర్ పప్పు రాజారావు అన్నారు. ఈ మధ్యనే రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎర్రిబాబు కుటుంబానికి గురువారం శ్రీనగర్‌లో శ్రీ పద్మ మార్కేండేయ సేవా సంఘ సభ్యుల ఆధ్వర్యంలో నెలకు సరిపడ నిత్యావసర సరుకులు, ఐదువేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా వారికి ఏ కష్టం వచ్చినా సంఘం సాయంగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో అభివృద్ధి పనులు పరిశీలన



పనులను పరిశీలిస్తున్న దృశ్యం

అగనంపూడి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిలో చేపడుతున్న అభివృద్ధి పనులను గురువారం కూటమి నేతలు పరిశీలించారు. పనుల గురించి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపీకృష్ణ చర్చించారు. ఈ సందర్భంగా గోపీకృష్ణ మాట్లాడుతూ ఆసుపత్రిని వంద పడకలకు అప్‌గ్రేడ్ చేశారని, అందుకు తగినట్లు భవనాలు, రోడ్లు, డ్రైనేజీలను నిర్మిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే దాదాపుగా పనులు పూర్తయినట్టు వెల్లడించారు. దసరా నాటికి ఆసుపత్రిలో వంద పడకలను అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా చర్యలు చేపట్టినట్టు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఆస్పత్రి ఏవో రరిరాజ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

'పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'



పారిశుధ్య కార్మికుల సమావేశంలో ప్రసంగిస్తున్న జి అప్పారావు

అక్కిరెడ్డిపాలెం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ కాంట్రక్టు పారిశుధ్య కార్మికుల సమస్యలను అధికారులు సత్వరమే పరిష్కరించాలని కాంట్రక్టు వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) కార్యదర్శి గొలగాని అప్పారావు కోరారు. 69 వార్డు హరిజన జగ్గయ్యపాలెంలో గురువారం జరిగిన పారిశుధ్య కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ కార్యాలయం వద్ద శనివారం నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

అక్రమాలపై దృష్టి సారించాలని వినతి

పెందుర్తి రూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతగట్లలో గ్రామ సర్పంచ్ భర్త గనిశెట్టి కనకరాజు తీరు మార్చుకోవాలని గ్రామంలోని కూటమి నేతలు మండిపడ్డారు. గురువారం చింతంగట్లలో నిర్వహించిన సమావేశంలో కూటమి నేతలు మాట్లాడుతూ ఇప్పవానిపాలెంలో వైసీపీ హయంలో ఇళ్ల స్థలాల పేరిట సర్వే నంబర్ 81-2 భూమిని ఆక్రమణలకు పాల్పడితే కూటమి నేతలు అడ్డుకున్నారని, ఇప్పుడు అదే భూమిని జనసేన నేతలు ఆక్రమించారనే ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఊరిలో జరుగుతున్న అక్రమాలపై జిల్లా అధికారులు దృష్టి పెట్టాలని కోరారు.

బోధనలో త్రీడీ


స్కాన్ చేస్తే పూర్తి వివరాలు తెలిసేలా..

ఏయూ మహిళా ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థుల వినూత్న ఆవిష్కరణ

- ఆగ్యుమెంటెడ్ రియాలిటీ బేస్ట్ ఎడ్యుకేషన్‌కు ఉపయోగపడేలా కోడింగ్ చేసిన విద్యార్థులు
- ఈ యాప్‌లో ఫొటోలను స్కాన్ చేయడం ద్వారా త్రీడీ విధానంలో చూసే వెసులుబాటు
- టచ్ చేయడం ద్వారా చిత్రంలోని ప్రతి అంశాన్ని స్పష్టంగా తెలుసుకునే అవకాశం
- సైన్స్, ఇతర సబ్జెక్టుల బోధనలో విద్యార్థులకు మేలు చేకూర్చేలా డిజైన్
- స్కాన్ చేసే ఫొటోకు సంబంధించిన అంశాలను కోడింగ్ చేసిన విద్యార్థులు
- కోడింగ్ విధానంతో త్రీడీ విధానంలో ఫొటోలు, వీడియోలు డిస్‌ప్లే


గుండె గురించి వివరిస్తున్న యాప్

(ఆంధ్రజ్యోతి/విశాఖపట్నం)

ఆంధ్రా యూనివర్సిటీ మహిళా ఇంజనీరింగ్ కళాశాల పరిధిలోని ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన విద్యార్థులు సరికొత్త ఆవిష్కరణ చేశారు. పాఠశాల విద్యార్థుల బోధనలో సరికొత్త విధానానికి శ్రీకారం చుట్టేలా ఆధునిక సాంకేతికతను డిజైన్ చేశారు. పుస్తకంలోని బొమ్మను యాప్‌లో స్కాన్ చేయడం ద్వారా త్రీడీ విధానంలో ఆయా చిత్రాన్ని చూసేలా సరికొత్త సాంకేతికతను కోడింగ్ చేశారు. దీనివల్ల విద్యార్థులు సైన్స్, ఇతర పాఠ్యాంశాలను మరింత అర్థవంతంగా నేర్చుకునేందుకు అవకాశం ఉంటుందని ఇంజనీరింగ్ విద్యార్థులు చెబుతున్నారు.

యాప్‌లో స్కాన్ చేసే చిత్రం త్రీడీలో ఫోన్, ఇతర స్క్రీన్‌లపై డిస్‌ప్లే అవుతుంది. దానిని విద్యార్థులు టచ్ చేసి తమకు కావాల్సిన వైపు తిప్పి మరింత లోతుగా విశ్లేషించుకునేందుకు అవకాశం ఉంది. ఉదాహరణకు పేపర్‌పై హార్ట్ చిత్రాన్ని ఈ యాప్‌లో స్కాన్ చేస్తే త్రీడీలో హార్ట్ ఫొటో, వీడియో డిస్‌ప్లే అవుతుంది. దానిని విద్యార్థులు టచ్ చేయడం ద్వారా హార్ట్ ఫంక్షనింగ్, గుండెలోని ఇతర భాగాలు, వాటి పనితీరు వంటి అంశాలను తెలుసుకోవచ్చు. ఇందుకోసం నంబర్ విధానాన్ని కూడా విద్యార్థులు కోడ్ చేశారు. త్రీడీ నమూనాను క్లిక్ చేయగానే కనిపించే నంబర్లను టచ్ చేస్తే ఆయా అవయవాలకు సంబంధించిన మరిన్ని వివరాలు అందులో ఉంటాయి. ఇది ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు సైన్స్, టెక్నాలజీకి సంబంధించిన పాఠాల బోధనకు ఎంతగానో ఉపయోగపడుతుందని విద్యార్థులను గైడ్ చేసిన ఎలక్ట్రికల్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కొణతాల అరవింద శిల్ప తెలిపారు.

పనిచేసే తీరు..

విద్యార్థులు డిజైన్ చేసిన ఈ ఆధునిక సాంకేతికత పూర్తిగా కోడింగ్‌పై ఆధారపడి ఉంది. ఇందుకోసం ఇప్పటికే అందుబాటులో ఉన్న రెండు యాప్‌లను వినియోగిస్తున్నారు. ఈ యాప్‌లో ముందుగానే విద్యార్థుల పాఠాల బోధనకు అవసరమైన చిత్రాలకు సంబంధించిన అంశాలను కోడింగ్ చేస్తారు. ఉదాహరణకు గుండెకు సంబంధించిన అంశాలను త్రీడీ విధానంలో ఫొటో, వీడియో రూపంలో చూడాలనుకుంటే అందుకనుగుణంగా గుండె పనితీరు, గుండెలోని భాగాలు, రక్త ప్రసరణ, ఇతర అంశాలను కోడింగ్ ద్వారా యాప్‌కు డేటా అందిస్తారు. ఈ సమాచారాన్ని క్రోడీకరించుకున్న తరువాత యాప్‌లో పుస్తకంలో గుండె ఫొటోను స్కాన్ చేయడం ద్వారా మొత్తం సమాచారాన్ని త్రీడీ విధానంలో చూసుకునే వెసులుబాటు కలుగుతుంది. ప్రస్తుతం యాప్‌లో గుండె, బ్లడ్ సర్క్యులేటివ్ సిస్టమ్‌కు సంబంధించిన అంశాలను మాత్రమే కోడింగ్ చేశారు. దీని పేటెంట్ కోసం ఇప్పటికే విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. పేటెంట్ రైట్స్ వచ్చిన తరువాత మార్కెట్‌లోకి తీసుకురావాలన్న యోచనలో వారున్నారు. ముఖ్యంగా పాఠశాలలకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని, విద్యార్థులు లోతైన సమాచారాన్ని, స్వీయ అనుభూతిని పొందేందుకు తద్వారా ప్రతి అంశాన్ని గుర్తు పెట్టుకునేందుకు ఇది ఉపకరిస్తుందని ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు చెబుతున్నారు. పాఠశాలలు తమ అవసరాలకు అనుగుణంగా దీనిని వినియోగించుకోవచ్చని, అందుకనుగుణంగా తాము కోడింగ్ చేసి అందిస్తామని వారు పేర్కొంటున్నారు.


ప్రిన్సిపాల్ పద్మశ్రీ, గైడ్ అరవింద శిల్పతో యాప్‌ను రూపకల్పన చేసిన ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు


త్రీడీ విధానం గురించి వివరిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ అరవింద శిల్ప

ఇదీ బృందం..

ఈ ఆధునిక సాంకేతికతను ఆగ్యుమెంటెడ్ రియాలటీ బేస్డ్ ఎడ్యుకేషన్ విజువలైజేషన్ కోసం డిజైన్ చేశారు. ఇందుకోసం యూనిటీ, వూఫ్రా అనే రెండు యాప్‌లను వినియోగిస్తున్నారు. త్రీడీ ఎఫెక్ట్‌తో చిత్రాలు, వీడియోలు చూసేందుకు అనుగుణంగా కోడింగ్ చేస్తున్నారు. ఈ టెక్నాలజీని ఇంజనీరింగ్ ఎలక్ట్రికల్ విభాగం ఫైనలియర్ పూర్తి చేసిన ఎస్.ఝాన్సీ బి.లోకేశ్వరి, ఆర్.యక్షిత డిజైన్ చేయగా... ఈ బృందానికి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కొణతాల అరవింద శిల్ప గైడ్‌గా వ్యవహరించారు. ఈ టెక్నాలజీని ఆవిష్కరించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.పద్మశ్రీ, విభాగాధిపతి ఆర్.శ్రీను నాయక్ అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ విభాగాధిపతి, ప్రిన్సిపాల్, గైడ్‌ల సహకారంతో ఈ ఆవిష్కరణ చేశామన్నారు. దీనిని మార్కెట్‌లోకి తీసుకు వచ్చేందుకు కృషి చేస్తామన్నారు. పేటెంట్ వచ్చిన తరువాత మరింతగా అభివృద్ధి చేస్తామన్నారు. 45 రోజుల్లోనే ఈ సాంకేతికతను అభివృద్ధి చేసినట్టు విద్యార్థులు వెల్లడించారు. అన్నింటికంటే ముఖ్యంగా ఈ యాప్‌లు ఇంటర్నెంట్ అవసరం లేకుండా పని చేస్తాయని, కాబట్టి ఎక్కడ ఉన్నా సులభంగా వినియోగించుకోవచ్చన్నారు. యూట్యూబ్‌లో పాఠాలు వినడం ద్వారా కొంతవరకు మాత్రమే నేర్చుకునేందుకు అవకాశం ఉంటుందని, ఈ విధానంలో విద్యార్థులు ప్రతి అంశాన్ని టచ్ చేసి మరింత లోతుగా విశ్లేషించి, తమకు కావాల్సిన వైపు తిప్పుకుని విశ్లేషించుకునే అవకాశాన్ని కల్పించడం వల్ల మరింత అర్థం చేసుకుంటారని వారు పేర్కొన్నారు.

చెరువుల మీదుగా రహదారులా!?

... 5వ పేజీ తరువాయి

కమిషనర్ విశ్వనాథన్‌లు గురువారం నిర్వహించిన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో సంఘాలు, కాలనీ అసోసియేషన్లు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో పాటు ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, లోకం నాగమాధవి తదితరులు హాజరై అభ్యంతరాలు వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా కమిషనర్ విశ్వనాథన్ మాట్లాడుతూ, నగరంలో మెట్రో రైలు ప్రాజెక్టు అధికారులతో సమన్వయం చేసుకొని వెళతామని, ఆ ప్రాజెక్టులో పైన నాలుగు వరుసల ఎక్స్‌ప్రెస్ హైవే వస్తుందని వెల్లడించారు. అదే విధంగా విశాఖపట్నం పోర్టుకు ప్రత్యేకంగా మాస్టర్ ప్లాన్ ఉందని, దాంతో కూడా ఈ మాస్టర్ ప్లాన్ ఇంటిగ్రేట్ అయ్యేలా చూస్తామన్నారు.

అభ్యంతరాలు...

- కాపులుప్పాడలో 1998లో వుడా లేఅవుట్ వేసి పేద, మధ్య తరగతి ప్రజలకు ప్లాట్లు విక్రయించిందని, ఇప్పుడు ఆ లేఅవుట్ మధ్య నుంచి మాస్టర్ ప్లాన్ రహదారి ప్రతిపాదించారని, దీనివల్ల సంస్థకే చెడ్డపేరు వస్తుందని, తక్షణం అటువంటి రహదారులను తీసేయాలని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కోరారు.
- సిరిపురం జంక్షన్ నుంచి సంపత్ వినాయకుడి గుడి, ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా రైల్వే స్టేషన్ వరకు 45 మీటర్ల రహదారి ప్రతిపాదించారని, అది ఆచరణ సాధ్యం కాదని, అలా చేస్తే జీవీఎంసీ కమిషనర్ బంగ్లా, సంపత్ వినాయకుడి ఆలయం తదితరాలన్నీ పోతాయని నగరంలో ఏ రహదారిని కూడా 30 మీటర్లకు మించి విస్తరించవద్దని ఎమ్మెల్యే వెలగపూడి సూచించారు.
- సింహాచలం రైల్వేస్టేషన్, బాజీ జంక్షన్, కాకాని నగర్, విమానాశ్రయం తదితర ప్రాంతాల్లో 30 నుంచి 40 అడుగుల రహదారులు ఉన్నాయని, వాటిని విస్తరించాలనే ప్రతిపాదన పెట్టకపోతే రైల్వే అధికారులు భూములు ఇవ్వరని, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఆయా ప్రాంతాల్లో అవసరమైన రహదారులను చూపించాలని ఎమ్మెల్యే గణబాబు కోరారు.
- అనకాపల్లి నుంచి విశాఖ నగరం మీదుగా ఆనందపురం వరకు జాతీయ రహదారిని హెచ్చు తగ్గులు లేకుండా 60 మీటర్ల మేర విస్తరిస్తే అందులోనే గ్రీన్ బెల్ట్, కాలువలను కలిపి చూపించాలని, వాటి కోసం అదనంగా మరికొంత స్థలం కావాలనొద్దని కొందరు కోరారు.
- విశాఖ నుంచి భీమిలి బీచ్ మార్గంలో గ్రీన్ బెల్ట్‌ను సముద్రం వైపు మాత్రమే పెట్టాలని, ప్రైవేటు స్థలాలు ఎక్కువగా ఉన్నా ఎడమ వైపు పెట్టవద్దని కొన్ని సంఘాలు లేఖలు సమర్పించాయి.
- ఆనందపురం మండలం బోయపాలెంలో చెరువు మీదుగా మాస్టర్ ప్లాన్ రహదారి వేశారని దానిని తీసేయాలని అక్కడి రైతులు విన్నవించారు.
- గంభీరం పంచాయతీలో కొన్ని సర్వే నంబర్లలో భూమి ఎకో సెన్సిటివ్ జోన్‌గా చూపించారని, అది వైసీపీ నేతలు కక్షపూరితంగా చేసినందున దానిని మిక్స్‌డ్ జోన్‌లోకి మార్చాలని సర్పంచ్ కోరారు.
- భీమిలి చిన్నబజారులో ప్రతిపాదించిన రహదారి వల్ల తమ ఇళ్లను కోల్పోతామని అందుకని ఆ రహదారిని తీసేయాలని అక్కడి వారు కోరారు.
- భోగాపురం, డెంకాడల్లో ప్రతిపాదించిన 24 మీటర్ల రహదారులు చెరువులు మీదుగా చూపించారని, వాటిని తొలగించాలని కోరారు.
- వెంకోజీపాలెం నుంచి హెచ్‌బీ కాలనీ మీదుగా సీతమ్మధార వరకూ ప్రస్తుత రహదారినే ఉంచాలని, విస్తరణ వద్దని పలువురు కోరారు.
- పోర్టుపాలెం సర్వే నంబర్లు 63 నుంచి 68 వరకు ప్రాంతాలను పారిశ్రామిక ప్రాంతంలో చూపించారని, నివాస ప్రాంతంగా మార్చాలని విన్నవించారు.

అది సాయిరెడ్డి కార్యాలయంలో తయారైన మాస్టర్ ప్లాన్

-ఎమ్మెల్యేలు వెలగపూడి, గణబాబు

వైసీపీ హయాంలో మాస్టర్ ప్లాన్-2041ను వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో కాకుండా సాయిరెడ్డి కార్యాలయంలో తయారు చేశారని, అందుకే నాడు 17 వేలకు పైగా అభ్యంతరాలు వచ్చాయన్నారు. వాటిని పరిగణనలోకి తీసుకోకుండా డ్రాఫ్ట్‌లో ఉన్న ప్రతిపాదనలు పక్కన పెట్టి ఫైనల్ దాంట్లో మార్చేసిన ప్లాన్ పెట్టారని ఆరోపించారు. అందుకే వాటిని సవరించాలని సీఎం చంద్రబాబునాయుడు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారన్నారు.

ఇగ్నో అడ్మిషన్ల గడువు పెంపు

ఎంవీపీ కాలనీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఈ ఏడాది దూరవిద్యా కోర్సులతో పాటు ఆన్‌లైన్ కోర్సుల్లో ప్రవేశాల కోసం గడువును ఈనెల 11 వరకు పొడిగించింది. అన్ని సర్టిఫికెట్, డిప్లొమా, పీజీ డిప్లొమా, డిగ్రీ, అన్ని పీజీ కోర్సులకు ఈ గడువు వర్తిస్తుందని కేంద్రం సీనియర్ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. విశాఖప్రాంతీయ కేంద్రం పరిధిలోని 11 జిల్లాలో ఉన్న అధ్యయన కేంద్రాలన్నింటిలో ప్రవేశాలు పొందవచ్చన్నారు. ఫీజులు ఆన్‌లైన్‌లోనే చెల్లించాలని, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 50 శాతం ఫీజు రాయితీ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు ఇగ్నో వెబ్‌సైట్ లేదా, ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని ఈ మెయిల్ ద్వారా సంప్రదించాలని కోరారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రైలులో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పట్టుకుని రూ.65 వేల విలువైన 13 కిలోల గంజాయి బ్యాగ్‌లను స్వాధీనం చేసుకున్నారు. గురువారం ప్లాట్‌ఫామ్‌పై తనిఖీలు నిర్వహిస్తుండగా ఒడిశాకు చెందిన హేమంత్ జానీ (18) అనే రైలులో గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు.

ఈపీడీసీఎల్ జోన్-1 ఈఈగా 'పోలాకి'

విశాఖపట్నం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఏపీఈపీడీసీఎల్ జోన్-1 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పోలాకి శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను ఆకస్మికంగా జోన్-3 (మధురవాడ) నుంచి జోన్-1 (సర్కిల్ కార్యాలయం)కు ఇటీవల బదిలీ చేయడంతో అవమానంగా భావించి బాధ్యతలకు దూరంగా ఉన్నారు. రాజకీయ ఒత్తిళ్లతో శ్రీనివాసరావును బదిలీ చేశారన్న ప్రచారం జరగడంతో ఉన్నతాధికారులు ఆయనను పిలిచి మాట్లాడినట్టు సమాచారం. కొన్ని కారణాల వల్ల బదిలీ తప్పలేదని, జోన్-1లో సమర్థవంతంగా పనిచేస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని సూచించడంతో ఆయన విధుల్లో చేరారు.

కొండలు కొల్లగొడుతున్నారు

... 5వ పేజీ తరువాయి

అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ నుంచి అనుమతులు ఉండాలి. అంత సులువుగా అనుమతులు రావడం లేదు. దీంతో ఉమ్మడి జిల్లాలో కొంతమంది ఎటువంటి అనుమతులు తీసుకోకుండానే కొందరు కొండలను తవ్వేస్తున్నారు. స్థానికంగా ఎవరైనా ఫిర్యాదు చేస్తే గనుల శాఖ దాడులు చేస్తోంది. ఒకేరోజు ఎక్కువ ఫిర్యాదులు వస్తే ఒకటి లేదా రెండుచోట్ల మాత్రమే దాడులు చేయగలుగుతోంది. అనకాపల్లి జిల్లాలోని పలుచోట్ల నుంచి ప్రతిరోజు రాత్రి రాంబిల్లిలో నిర్మాణంలో ఉన్న నేవల్ ప్రాజెక్టుకు 100 లారీల బండరాళ్లు వెళుతున్నాయి. గడచిన వారం, పది రోజుల్లో పెందుర్తి మండలం గుర్రంపాలెం, నరవల్లో అక్రమంగా గ్రావెల్ తవ్వుతున్న యంత్రాలను సీజ్ చేసి పోలీసులకు అప్పగించారు. ఆనందపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోసం కేటాయించిన కొండను చదునుచేసే కాంట్రాక్టర్ ఎటువంటి అనుమతి తీసుకోలేదు. అక్కడ మట్టి, గ్రావెల్‌ను తవ్వుతున్న మిషనరీని, లంకెలపాలెం సమీపాన పెదముషిడివాడలో సెంటు భూమి ఇళ్ల కోసం వేసిన లేఅవుట్ పక్కనే గ్రావెల్ తవ్వుతున్న యంత్రాలను పట్టుకున్నారు. గురువారం అనకాపల్లి సమీపాన ఊడేరులో రాళ్ల క్వారీలో యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. అయితే గనుల శాఖ విజిలెన్స్ రెగ్యులర్ సిబ్బంది దాడులు చేసి యంత్రాలను స్వాధీనం చేసుకున్న వెంటనే కూటమి పార్టీల నేతలు, ప్రజా ప్రతినిధులు రంగంలోకి దిగుతున్నారు. కొందరు అయితే బెదిరింపులకు పాల్పడుతున్నారు. నగర శివారుల్లో ఒక అక్రమ క్వారీ వద్ద యంత్రాలు పట్టుకుని పోలీసులకు అప్పగించిన వెంటనే కూటమి నేతలు ...గనుల శాఖ విజిలెన్స్ అధికారులకు ఫోన్ చేసి బెదిరించారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో అక్రమ క్వారీయింగ్‌పై ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్టు తెలిసింది. అక్రమ క్వారీయింగ్‌ను అడ్డుకట్ట వేసేందుకు కీలక ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటుచేస్తే మంచిదని విజిలెన్స్ విభాగం అధికారి ఒకరు పేర్కొన్నారు.

సింహాచలం రైల్వే స్టేషన్‌లో టికెట్ తనిఖీలు

- 211 కేసుల్లో రూ.లక్ష పది వేలు జరిమానాలు
- 16 రోజుల్లో 26,411 కేసుల్లో రూ.1.5 కోట్ల జరిమానా రూపంలో వసూలు



టికెట్ తనిఖీలు నిర్వహించిన సిబ్బంది

విశాఖపట్నం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : టికెట్ లేకుండా ప్రయాణించడాన్ని నియంత్రించడంతో పాటు ప్రయాణికుల భద్రత, సురక్షిత ప్రయాణం అందించడంలో భాగంగా వాల్తేరు డివిజన్ పరిధిలోని సింహాచలం రైల్వే స్టేషన్‌లో గురువారం టికెట్ తనిఖీలు చేపట్టారు. కమర్షియల్ విభాగం, ఆర్పీఎఫ్ సిబ్బంది సమన్వయంతో చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో టికెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారితో పాటు పార్శిల్ బుకింగ్ ద్వారా తీసుకెళ్లాల్సిన లగేజీని కోచ్‌లో తీసుకువెళుతున్న వారిపై 211 కేసులు నమోదు చేసి వారి నుంచి సుమారు రూ.లక్ష పది వేలు జరిమానా వసూలు చేసినట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. జూలై ఒకటి నుంచి 16వరకు వాల్తేరు డివిజన్ వ్యాప్తంగా నిర్వహించిన టికెట్ తనిఖీల డ్రైవ్‌లో ఇప్పటివరకు 26,411 కేసులు నమోదు చేసి రూ.1.5 కోట్ల మొత్తాన్ని జరిమానా రూపంలో వసూలు చేసినట్టు వెల్లడించారు. సురక్షిత ప్రయాణ పద్ధతులు పాటించాలని, చెల్లుబాటు అయ్యే టికెట్లతో ప్రయాణం చేయాలని, రైలు దిగే ఎక్కే సమయంలో జాగ్రత్తలు పాటించడంతో పాటు భద్రతపై దృష్టి సారించాలని ఆయన సూచించారు.

క్రైం... crime news


స్వాధీనం చేసుకున్న కారు, బైకుతో పోలీసు అధికారులు

కారు దొంగ అరెస్టు

ఎంవీపీ కాలనీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): చాలా మందికి ఇంటి తాళాలను చెప్పుల స్టాండు, షూస్టాండ్ లేదా కిటికీ పక్కన, ద్వారానికి ఆనుకుని... ఇలాంటివి రహస్య ప్రదేశాలుగా భావించి బయటకు వెళుతుంటారు. తమ వారు వస్తే, తాళాలు తీసుకుంటారని. అయితే, ఇవన్నీ తెలిసిన దొంగలకు చోరీ చేయడం చాలా సులభమవుతోంది. ఓ దొంగ దర్జాగా ఇంటి తాళం తీసి, ఇంట్లో ఉన్న కారు తాళం తీసుకొని బయట పార్కింగ్‌లో ఉన్న ఐ20 కారును దొంగిలించి వెళ్లిపోయాడు. దొంగను, అతడితో పాటు కారు, ఓ బైకును స్వాధీనం చేసుకున్న ఎంవీపీ పోలీసులు కేసు వివరాలను గురువారం ఎంవీపీ స్టేషన్ ఆవరణలో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. లాసన్స్‌బే కాలనీ జమున ఆర్కేడ్‌లో ఉంటున్న తిరుమలరాజు సమతారాజు ఈ నెల 15న ఉదయం ఇంటికి తాళం వేసి, తలుపు సమీపంలోని షూ ర్యాక్‌లో తాళం చెవి ఉంచారు. తిరిగి వచ్చి చూసేసరికి ఇంట్లోని కారు తాళం చెవి, బయట ఉండాల్సిన కారు కనిపించలేదు. దీంతో ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ చక్రధరరావు పర్యవేక్షణలో ఎస్ఐ రవికుమార్, ఏఎస్ఐ కిషోర్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు చురుగ్గా దర్యాప్తు చేశారు. పెద జాలారిపేటకు చెందిన పాత నేరస్థుడు వాసుపల్లి ఎల్లాజీ రాజు ఈ నేరానికి పాల్పడినట్టు గుర్తించారు. నేరస్థుడి నుంచి ద్విచక్రవాహనం, ఐ 20 కారును స్వాధీనం చేసుకున్నారు. విచారణలో చురుగ్గా దర్యాప్తు చేసిన కానిస్టేబుళ్లు హరి ప్రసాద్, జగత్ కిరణ్, సాయిలను ఏసీపీ లక్ష్మణ్‌రావు అభినందించారు.

యువతి వీడియోలు తీశారంటూ హాస్టల్ వార్డెన్, యువకులపై దాడి

- తాము ఏ తప్పు చేయలేదంటూ పోలీసులను ఆశ్రయించిన యువకులు
- పోలీసులకు ఇరువర్గాల ఫిర్యాదు

సీతంపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ద్వారకా పోలీసు స్టేషన్ పరిధి ఆశీల్‌మెట్ట శ్రీనగర్‌లో ఒక లాడ్జిలో దిగిన ఒక యువతికి సంబధించిన న్యూడ్ వీడియోలు పక్కనే ఒక హాస్టల్‌లో ఉన్న యువకులు సెల్‌ఫోనులో తీశారనే ఉద్దేశంతో ఆ యువతి స్నేహితుడు తన స్నేహితులతో కలిసి వచ్చి హస్టల్ వార్డెన్‌ను, అందులో ఉన్న యువకులపై దాడి చేసి కొట్టాడు. ఈ విషయమై ఇరువర్గాలు బుధవారం రాత్రి పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. సావేర లాడ్జిలో ఈ నెల 11న యువతీ యువకుడు సందీప్, ప్రసన్న ప్రేమికులని చెప్పి దిగారు. అయితే గురువారం రాత్రి లాడ్జి రూమ్‌లో ఉన్న యువతి ప్రసన్న న్యూడ్ వీడియోలు పక్కనే ఉన్న హాస్టల్‌లో యువకులు తీశారని ఆరోపిస్తూ సందీప్ తన స్నేహితులతో కలిసి హాస్టల్‌లో ప్రవేశించి వార్డెన్ రమేష్‌తో పాటు మరో ముగ్గురు యువకులను చిదకబాదారు. దీంతో రమేష్‌తో పాటు ఆ ముగ్గురు యువకులకు తీవ్రంగా గాయాలయ్యాయి. ఇరు వర్గాల వారు ద్వారకా పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఇరువర్గాలకు పోలీసులు కౌన్సెలింగ్ చేయడంతో వెళ్లిపోయారు. అయితే తమను అవసరంగా కొట్టరని, తామేమీ వీడియోలు తీయలేదంటూ హాస్టల్ వార్డెన్, బాధిత యువకులు నగర పోలీసు కమిషనర్‌ను కలిశారు. దీంతో ఇరు వర్గాల వారిని ద్వారకా పోలీసు స్టేషన్‌కు గురువారం పిలిపించారు. సీఐ రమణ పర్యవేక్షణలో ఇరువర్గాలను విచారిస్తున్నారు.

బంగారం గొలుసు చోరీ

ఎంవీపీ కాలనీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : విశాఖ వచ్చిన హైదరాబాద్ వాసి లాడ్జిలో బస చేయగా, అతడి బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన పి.కృష్ణ తన కుటుంబంతో జూలై 1న విశాఖ వచ్చారు. లాసన్స్ బే కాలనీలోని ఎల్‌బీ లాడ్జి అతిథి గృహంలో బస చేశారు. రెండో తేదీ సింహాచలం క్షేత్రానికి వెళ్లి తిరిగి లాడ్జికి వచ్చారు. గదిలోనే ఉంచిన తన బంగారు గొలుసు కనిపించకపోవడంతో ఎవరో గదిలోకి వచ్చి, తస్కరించినట్టు గుర్తించారు. లాడ్జి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీకి గురైన బంగారు గొలుసు విలువ సుమారు రూ.75 వేలు ఉంటుందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో బాధితుడు కృష్ణ పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ కిశోర్‌బాబు తెలిపారు.